ప్రజాశక్తి
సోపతి
నవంబర్ 23, 2014 ఆదివారం అనుబంధం

బ్యాడ్మింటన్‌కు
కొత్త వెలుగు



చిత్ర కళ
కేరాఫ్ తెలంగాణ

- చింతపట్ల సుదర్శన్ కథ
- ఉత్తరాంధ్ర కథలపై సమీక్ష
- నిజాం గజల్స్ పరిచయం
- పాటల తోటలో వెన్నెలరేడు - వేటూరి

ఓంపురి ఉంటే సినిమా చూడొచ్చు



పాత్రలకు ప్రాణం పోసి సజీవంగా నిలబెట్టే అరుదయిన కళాకారుడు ఓంపురి అనే మాట మరోసారి అనిపించింది. ఈమధ్యన అనుకోకుండా 'ద హండ్రెడ్స్ ఫుట్ జర్నీ' చూడటం తటస్థించింది. నిజంగా అంతర్జాతీయ నటుడు మన ఓంపురి అనిపించింది. 65 సంవత్సరాల వయసులో కూడా సహజాతా సహజంగా పాత్రలో ఒదిగిపోయే అతనిలోని నటుడికి జేజేలు చెప్పాలి. ప్రతిభకు వయసుతో నిమిత్తం లేదు. నటన కూడా అంతే. నటునికి కూడా వయసుతో నిమిత్తం లేదు. పాత్రల తీరుతెన్నులు మారవచ్చు. కానీ పాత్రలో లీనమై ఆ పాత్రకు ప్రాణప్రతిష్ట చేయడమే నటునిలోని అసలుసిసలు కళా స్వభావం.

ఈ సత్యం ఇరవై ఏళ్ళ వయసులోనే గ్రహించిన కళాకారుడు ఓంపురి. పుణెలోని ఫిలిం అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా, ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్.ఎస్.డి.) లోనూ చదువుకున్న విద్యార్థి. ఎన్.ఎస్.డి.లో ఓంపురికి సహ విద్యార్థి నసీరుద్దీన్ షా. ఈ ఇద్దరి ప్రతిభ భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసింది. తొలినాళ్ళలో రూపుదిద్దుకున్న కళావిలువల కొనసాగింపు ఓంపురిలో ఇప్పటికీ చూస్తాం. అందుకే తాజా ఉదాహరణ 'ద హండ్రెడ్ ఫీట్ జర్నీ'. ఈ చిత్రాన్ని నిర్మించినవారు స్పీల్‌బర్గ్, ఓప్రా విన్‌ఫ్రే కావడం విశేషం. రిచర్డ్ సి మోరిస్ రాసిన నవల ఆధారంగా నిర్మించిన చిత్రమిది. ఈ ఏడాది ఆగస్టు 18న విడుదలయి ఇప్పటికే దాదాపు ఎనిమిదిన్నర కోట్ల డాలర్లు సంపాదించింది. చిత్ర నిర్మాణానికి అయిన ఖర్చు కేవలం 2 కోట్ల 20 లక్షల డాలర్లు మాత్రమే.

ఓంపురి, హెలెన్ మిరెన్, మనీష్ దయాళ్, చార్లెట్ లీ బాన్ నాలుగు ప్రధాన పాత్రల్లో నటించారు. రెండు రెస్టారెంట్ల యజమానుల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం లాంటి వాతావరణంలో మలుపులు తిరిగే ఆసక్తికరమైన కథనంతో కూడిన చిత్రమిది. అందులో కొత్తగా ఏర్పాటు చేసిన ఇండియన్ రెస్టారెంట్ యజమాని పాత్రలో ఓంపురి నటించారు. ఆ పాత్రకు తగిన ఆహార్యంతో, హావభావాలతో రక్తి కట్టించిన ఓంపురిని చూస్తే, మూడు దశాబ్దాల కిందటి ఓంపురి గుర్తుకొచ్చారు. 'అర్ధసత్య'లో యాంగ్రీ యంగ్‌మెన్ లాంటి నిజాయితీ గల పోలీసాఫీసర్ పాత్రలో నటించిన ఓంపురి ఒక జ్ఞాపకం. అప్పుడు ముప్పయిల్లో వున్నారు. ఇప్పుడు 'హండ్రెడ్ ఫీట్స్ జర్నీ'లోని ఓంపురికి 65 సంవత్సరాలు. అయితేనేం నటునిగా అదే నిబద్ధత. అదే ప్రతిభ. అదే కౌశలం. అందుకే ఓంపురి మూడు దశాబ్దాలుగా ఒక ప్రత్యేక ఆకర్షణ.

ఓంపురికి నటన కేవలం వృత్తి కాదు. కళాసాధన. వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు లేకపోలేదు. కానీ నటునిగా ఎప్పటికప్పుడు పరిణతి చెందుతూ కనిపిస్తాడు. అతను, నసీరుద్దీన్‌షా కలిసి నటించిన 'ద్రోహకాల్' కూడా గుర్తుండిపోయే చిత్రం. అలాగే 'ఆస్తా'లో రేఖ భర్తగా చేసిన పాత్రలో రొమాంటిక్ సన్నివేశాల్లో కనబరిచిన సహజత్వం ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేసింది. అటు ఆర్ట్ సినిమాల్లోనూ, ఇటు కమర్షియల్ సినిమాల్లోనూ రాణిస్తూ, బాలీవుడ్‌లో తనదయిన విలక్షణ ప్రతిభను కనబరిచే ఓంపురి బాలీవుడ్‌కే పరిమితం కాలేదు. హాలీవుడ్ సినిమాల్లోనూ, వరల్డ్ సినిమాల్లోనూ నటించే అవకాశాలు వచ్చాయి. వాటన్నిటిని సద్వినియోగం చేసుకున్నారు. నటునిగా ఉన్నతస్థాయి ప్రతిభను ప్రదర్శించారు ఓంపురి. అతని ఇంగ్లీషు ఉచ్చారణ అతి స్పష్టంగా ఉంటుంది. మై సన్ ద ఫనటిక్, ఈస్ట్ ఈజ్ ఈస్ట్, పెరోల్ ఆఫీసర్, సిట్ ఆఫ్ జాయ్, ఘోస్ట్ అండ్ ది డార్క్‌నెస్ మొదలయిన చిత్రాల్లో ఓంపురి నటనాశైలికి అనూహ్యమైన స్పందన వచ్చింది. అలాగే 'చార్లీ విల్సన్స్ వార్'లో టామ్ హంక్స్, జూలియా రాబర్ట్స్‌తోపాటు జనరల్ జియావుల్ హక్ పాత్రలో ఓంపురి నటించడం అతని కెరీర్‌లో మంచి మలుపు. బ్రిటిష్ చిత్రాల్లోనూ, అమెరికన్ చిత్రాల్లోనూ ఉత్తమనటుల సరసన కలిసి నటించడం ఓంపురి గౌరవాన్ని ఇనుమడింపజేసింది. ఈ క్రమాన ఓంపురి సినిమాల్ని ప్రత్యేకంగా ఇష్టపడే ప్రేక్షక సమూహాలు మన దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా దేశదేశాల్లోనూ ఏర్పడ్డాయి. కేవలం 2.20 కోట్ల డాలర్లతో నిర్మించిన 'ద హండ్రెడ్ ఫుట్ జర్నీ' చిత్రం విడుదలయి ఆర్నెల్లు కాకముందే ఎనిమిదిన్నర కోట్ల డాలర్లు సంపాదించడమే ఓంపురి ప్రతిభ ఏమిటో తెలియజేస్తుంది. మన దగ్గరి సినిమా పరిభాషలో చెప్పుకోవాలంటే అది లోబడ్జెట్ చిత్రం. అయినప్పటికీ ఆసక్తికరమైన కథనంతో ఆకట్టుకునే చిత్రం. కళాకారుని సృజనకు వయసుతో నిమిత్తం లేదనే మాట ఓంపురి విషయంలో అక్షరాలా సత్యం. అతని సినిమా చూసే రెండు గంటల సమయం వృథా కాదు, ఓ మధురమైన సృజనాత్మక అనుభవం.

'అర్ధసత్య'లో ఓ దృశ్యం

'ద హండ్రెడ్ ఫీట్ జర్నీ'లోని దృశ్యం

ప్రజాశక్తి
సోపతి
నవంబర్ 23, 2014

■ అంతరంగం

శాస్త్రీయ దృక్పథం

సంపదలుండగానే సరిపోదు. నిత్యజీవితాచరణలో శాస్త్రీయదృష్టి ఉండాలి. అభివృద్ధి మంత్రం జపించగానే సరిపోదు. మానవ జీవన ప్రమాణాల్ని పెంచే సహేతుక దృక్పథం అవసరం. ఒకవైపున అభివృద్ధిని గురించి మాట్లాడుతూనే, మరోవైపున అన్ని పురాణాల్లో వున్నాయని చెప్పటం అర్ధరహితం. పురాణాల పుట్టుకకు కూడా మూలాలున్నాయన్న గ్రహింపు ముఖ్యం. నిత్యాజీవితాచరణలో శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరించాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శరవేగంగా వస్తున్న మార్పుల ఫలితాల్ని అనుభవిస్తూనే శాస్త్ర విజ్ఞానం ప్రాధాన్యం విస్మరించడం విషాదం.

మనిషి జిజ్ఞాస, అన్వేషణల ఫలితంగా రూపొందింది శాస్త్ర విజ్ఞానం. మనిషి నిరంతర సృజనశీలి. ఆలోచించడం గొప్ప గుణం. ఇదే మానవ సమాజ ప్రగతికి దోహదం చేసింది. గుంపులు గుంపులుగా జీవించే అలవాటు ఉన్న మనుషులు పరస్పరం సహకారంతో జీవించాల్సిన పరిస్థితులు సృష్టించింది కూడా శాస్త్రమే. ఎందుకంటే విజ్ఞానశాస్త్ర ఫలితాలు మానవ సమూహాల కంతటికీ అందుబాటులోకి రావాలంటే పరస్పర సహకారం, సమన్వయం అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకొని "విజ్ఞానశాస్త్రం ప్రపంచాన్ని అంతర్జాతీయం చేసి, పరస్పరాధారంతో మనవలసిన అవసరాన్ని కలిగించింది" అన్నారు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ.

ఆదిమ సమాజంలో గుంపుల మాదిరిగా తమ తమ పరిధుల్లోనే జీవించడం ఇవాళ అసాధ్యం. ఆ అగత్యమూ లేదు. శాస్త్రవిజ్ఞానం అప్రతిహతంగా ముందుకుపోతోంది. దీనిని సరయిన రీతిలో ఉపయోగించుకోవాలంటే శాస్త్ర విజ్ఞానం పట్ల అవగాహనతో పాటు విశాలభావన ఉండాలి. కానీ మార్కెట్‌శక్తుల ఆధిపత్యంలో శాస్త్ర విజ్ఞాన ప్రయోజనాలకు సైతం పరిమితులేర్పడ్డాయి. ఈ కారణంగానే శాస్త్ర విజ్ఞానాల్ని ఉపయోగించుకునే తీరుతెన్నుల్ని అర్థం చేసుకోవాలంటే వర్గదృష్టి ఉండాలి. సైన్స్ ఫలితాల్ని ఏ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగిస్తున్నారో అర్థం చేసుకోవాలి. అణ్వాయుధాల మీద పట్టు సంపాదించిన అగ్రరాజ్యాల స్వభావం భూమండలం మీద జరిగే అనేక హింసాత్మక ఘర్షణలకు, మారణహోమాలకు మూలం. ఈ నైజాన్ని వ్యతిరేకించడం సైతం శాస్త్రీయ దృక్పథంలో అంతర్భాగం. సైన్స్‌పై పట్టు సంపాదించిన సామ్రాజ్యవాద దేశాల పట్ల అప్రమత్తంగా ఉండేందుకు ఇది ఉపకరిస్తుంది. శాస్త్ర విజ్ఞానాన్ని సమస్త ప్రజల ఉపయోగార్థం అందుబాటులోకి తీసుకురావాలన్న భావనలకు బలం చేకూరుతుంది. దైనందిన జీవితంలో శాస్త్రీయదృష్టితో వ్యవహరించే మానసిక స్థయిర్యాన్ని ఇస్తుంది. నిర్దిష్టత నుంచి విశ్వజనీనత దిశగా మానవ ప్రయాణాన్ని విశాలం చేస్తుంది. అంతిమంగా మానవ జీవితాన్ని ఉద్దీపింపజేస్తుంది.

వెంటాడే వాక్యం

కళ ప్రజలది. ప్రజానీకం మధ్య దానిని దృఢంగా పాదుకొల్పాలి. అది ప్రజలకు అర్థమవాలి. వారు దానిని ప్రేమించాలి. వారి అనుభూతులను, ఆలోచనలను, అభీష్టాలను అది ప్రతిబింబిస్తూ వారిని ఉన్నతపరచాలి.
– లెనిన్

లేఖలు 4
పాటల తోటలో వెన్నెల రేడు వేటూరి 5
కవర్‌స్టోరీ
చిత్రకళ కేరాఫ్ తెలంగాణ 6
జోక్స్ కార్నర్ 10
బాడ్మిటన్‌కు కొత్త వెలుగు కిండాబి శ్రీకాంత్ 11
కథ
'స్వచ్ఛేజనా సుఖినోభవంతు 12
నెమలీక 14
సీరియల్ ప్రేమ - విప్లవం 16
స్ఫూర్తినిచ్చిన గురువు 18
సంగీతం అమ్మ అనే మాట ఒక కమ్మని కావ్యం 19
సృజన నిజాం గజల్ల పరిచయం 20
సోర్స్‌కోడ్ "సే థాంక్స్" 22
హెర్పిస్‌కు హోమియోతో చెక్ 23
సమీక్షలు
ఉత్తర తెలంగాణను ఉద్ధరించేదెప్పుడు? 24
ఈ వారం కవిత్వం
ఒక మరణ వాక్యం 26



తెలుగునాట చిత్రకళకు చిరునామాగా మారింది తెలంగాణ ఈ ప్రాంతానికి చెందిన దాదాపు *200* మంది చిత్రకారులు చిత్రకళ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేస్తున్నారు. ఈ పరిణామంపై విశ్లేషణాత్మక కథనమిది.

లేఖలు



వారి జీవిత చరిత్రల వ్యాసాలు

సోపతిలో వచ్చిన జీవిత చరిత్రలు బాగున్నాయి. అయితే కమ్యూనిస్టు పార్టీకి చెందిన నాయకుల (స్టాలిన్, మావో లాంటి నాయకుల చరిత్రలు) జీవిత చరిత్రలు చిన్నచిన్న వ్యాసాల రూపంలో ఇస్తే ఇంకా బాగుంటుంది.

-రాజు, మహబూబ్‌నగర్

వెరైటీ వంటలు ఇస్తే...

సోపతి బాగుంటుంది. అందులో వెరైటీ వంటకాల గురించి ఇస్తే బాగుంటుంది.

- సావిత్రి, నిజామాబాద్

స్ఫూర్తిదాయక చరిత్రలే ఆదర్శం

కవర్‌స్టోరీ కథనం 'స్ఫూర్తిదాయక చరితలు' చదివిన తర్వాత ప్రపంచ చరిత్రలో వివిధ రంగాలలో పేరు ప్రఖ్యాతులు గడించిన వారి ఆత్మ కథలు చదువుతుంటే... మళ్లీ వారే వచ్చి వారి జీవత కథనంతా స్వయంగా చెబుతున్నారా అనిపిస్తుంది. అలాంటి పుస్తకాలను పరిచయం చేయడం ఆనందంగా ఉంది. మార్క్స్ జీవిత చరిత్ర ప్రతివారికీ స్ఫూర్తిదాయకం. లెనిన్, స్టాలిన్ పుస్తకాలు చదువుతుంటే రష్యాలో వారు ప్రజల్లో తీసుకొచ్చిన విప్లవ భావాలు అర్థమవుతాయి. వివిధ దేశాల్లో కీలకపాత్ర పోషించిన వారి జీవిత చరిత్రలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా చేసిన జ్యోతిబసు జీవితం, ఆయన పాటించిన విలువలు నేటి రాజకీయ నాయకులకు కొండంత స్ఫూర్తి. పది మంది మేలు కోసం జీవించినవాడే మహానుభావుడు. తెలంగాణాలో వీరుల చరిత్రలు, స్వీయ చరిత్రలు అందరూ చదవాల్సినవే.

- కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్

మంత్రుల జాగీరు

'గ్రామ సీమల్లో మంత్రిగారి పాదయాత్ర' కథ వాస్తవానికి చాలా దగ్గరగా ఉంది. నేటి రాజకీయ నాయకులంతా పాదయాత్రలు చేసేది ప్రజలకు సేవ చేయాలనే అంకితభావంతో కాదని, ఓట్ల కోసమే అన్న విషయం అందరికీ తెలుసు. కానీ ఎవరికి వారు మనకెందుకులే అనుకుంటారు. ప్రభుత్వం తన సొంత జాగీరులాగా అక్కడ ఉన్న ఉద్యోగాలన్నీ తనవాళ్లకే దక్కాలనే స్వార్థంతో పాదయాత్ర కూడా రద్దు చేసుకునే ఇలాంటి మంత్రులను గెలిపించడం ఎంత తప్పో ప్రజలకు తెలిసేలా ఉంది ఈ కథ.

- సత్యం, పాన్‌గల్, మహబూబ్‌నగర్

విజ్ఞాన భాండాగారాలు

విద్యలేని వాడు వింత పశువు అనేది నానుడి. అది నిజం కూడా. విజ్ఞానం లేనివాడు ఎందుకూ పనికిరాడనేది కూడా అంతే నిజం. ఉపయోగించుకోవాలే గానీ ఎనలేని విజ్ఞానాన్ని అందించే భాండాగారాలు తెలంగాణలో చాలా ఉన్నాయి. తెలుగు భాష, సంస్కృతులను పరిరక్షించేవి, ముందు తరాల వారికి అందించేవి లైబ్రరీలోని పుస్తకాలే. ఇందుకోసం శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయం మొదలు అనేక గ్రంథాలయాలను నెలకొల్పారు. విద్యార్థులందరూ ఈ గ్రంథాలయాలలోని పుస్తకాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.

- స్నేహలత, కల్వచర్ల, కరీంనగర్

తేలికగా తెలుగు

అందరూ తెలుగు భాష గొప్పదనం గురించి చెప్తారు గానీ తమ పిల్లల్ని మాత్రం ఇంగ్లీష్ మీడియంలోనే చదివిస్తారు. అమ్మ భాష మీద పట్టు లేకపోతే మిగతాభాషల్లో ప్రావీణ్యం సంపాదించడం కూడా కష్టమే. అందుకే మాతృభాష తప్పనిసరిగా నేర్చుకోవాలంటారు ఎన్.ఆర్. అన్ని భాషల్లోకి తెలుగు నేర్చుకోవడమే కష్టమంటారు. తెలుగు తేలికగా నేర్చుకోవడానికి ఎన్.ఆర్.తెలుగు పద్ధతి పుస్తకం బాగుంది.

- సాత్విక్, తాడ్వాయ్, వరంగల్

మన జాతీయాలు

మీది పిట్టలకు సాంబారు కాచుట

ఆకాశంలో పక్షులు ఎగురుతున్నాయి. వేటగాడు గురి పెట్టుకొని కూర్చున్నాడు. పిట్టలు పడలేదు. ఇల్లాలు మాత్రం మీది పిట్టలు పడుతాయనే సాంబారు పొయ్యి మీద ఉడుకబెట్టింది. కార్యసిద్ధిని ఊహించి దురాశపడి తమకున్నదాన్ని వ్యర్థం చేసుకోవటం, ప్రణాళికా రహితమైన పని. గాలిమేడలు కట్టడం లాంటిదే. "ఏదీ కాలేదు. పోలేదు. నామినేషన్ వేయగానే మీది పిట్టలకు సాంబారు కాచినట్లు ఇప్పుడే గెలిచినట్లు సంబరపడిపోతే ఎలా?" అనటంలో ఈ జాతీయం ప్రయోగం వుంది.

ఏకిచ్చి పత్తి కొనుట

ముడి పత్తిని విడతీసి గిరక పట్టి గింజలేరి ఏకి శుభ్రపరిచితే గాని ఏకులు తయారు కావు. అంత కష్టపడి నూలు తీయటానికి సిద్ధపరచిన ఏకులను యిచ్చి పత్తిని కొనుట అమాయకమైన చర్యే. పంచతంత్రంలోని బియ్యానికి సరిగా తైలం అమ్మే వైశ్యకన్య కిటుకేదో ఉండి ఉంటుంది. ఆకర్షణీయమైన బహుమతుల ఎర చూపి చెత్త సరుకులను అమ్ముకునే వ్యాపారం ఆనాడు కూడా ఉన్నదే.

చేయి కోసి చేతికిచ్చుట

దానం చేయాలంటే చేతిలో పెడతారు. తనకు తోచిందెంతో ఇతరులకు చేతిలో పెట్టడం ఆనవాయితీ. ఎంత దాత అయినా చేతుల్లో పెట్టుతాడే కాని, పెట్టే చేయినే కోరుకున్నాడని కోసివ్వడు గదా. చేతికందినంత ఇతరుల కివ్వడమే తగదంటారు. అటువంటిది ఏకంగా చేయినివ్వటంలో దాతృత్వ పరిణతి వుండవచ్చు గాక, లౌక్యం లేనట్లే లెక్క. కారణాంతరాల వల్ల కర్ణుడు కవచకుండలాలను దానం ఇచ్చి, కష్టాలు కొనితెచ్చుకుని ప్రాణానికే ముప్పు తెచ్చుకున్నాడు. చేయి కోసి చేతికివ్వటం మాత్రం ఏకలవ్యుని నుండి పుట్టింది. ద్రోణాచార్యుడు దండం పంతులన్న ఏకలవ్యుని దండించినంత పనిచేశాడు. గురుదక్షిణగా పాపం ఏకలవ్యుని బొటనవేలును అడిగాడు. ఏ పాపమెరుగని ఏకలవ్యుడు చేయికోసి చేతికిచ్చాడు. కోసి ఇచ్చింది బొటనవేలైనా స్థూలంగా చేయి కోసి యిచ్చినట్లే. బొటనవేలే చేతికి అందునా విలుకాడైన ఏకలవ్యునికి సర్వస్వం. "నాలుగు రోజులు సోపతి చేసిందానికి మురిసి గుణమెరుగక చేయి కోసి చేతికిచ్చినట్లు ఇంట్లున్న రూపాలే కాక అప్పుదెచ్చి అంతా ఇస్తివి. వాడిప్పటికి జాడలేదు" అనటంలో ఈ జాతీయం ప్రయోగం వినవచ్చు.

- వేముల పెరుమాళ్ళు

పాటల తోటలో

వెన్నెల రేడు వేటూరి

పాటకు పల్లవి ప్రాణం.. మరి అలాంటి అందమైన పాటలెన్నో..'వేటూరి' కలం నుండి అలవోకగా అక్షరాలై జాలువారి పాటల తోటలో వెన్నెల కురిపించాయి.

కొమ్మలతో సన్నాయి పాడించేదీ.. అరచేతిన గోరింట పూయించేదీ.. ఎవరయ్యా..అంటే వేటూరి.. అని టక్కున చెప్పేయొచ్చు. వేటూరి పదక్రీడ వినసొంపుగా..చూడముచ్చటగా..గుండెకూ గొంతుకీ ఇదీ అని చెప్పలేనీ ఏదో తెలియని అనుభూతి.. అదే ఆయన భాషలోని సుధామాధుర్యం మనసుపొరల్లో నిండుగా ఇమిడిపోతుంది. అటువంటి మధురమైన పాటల్లో ఒకటి 'గోవుల్లు తెల్లన.. గోపయ్య నల్లన..గోధూళి ఎర్రన ఎందువలన..' గీత రచయిత మన 'వేటూరి సుందర రామ్మూర్తి' .

చిత్రం 'సప్తపది'. ఒక దళిత కుటుంబంలో అబ్బాయి, ఓ అగ్రకులంలో అమ్మాయి ప్రేమకథ ఆధారం. దర్శకుడు కె. విశ్వనాథ్.

కులమతాలకు వ్యతిరేకంగా చిత్రీకరించిన ఈ సినిమాలో వేటూరి కలం కుల దురహంకారాన్ని ఎండగట్టిందనడంలో ఎలాంటి సందేహం అవసరమే లేదు. సమాజంలో అడుగడుగునా నరనరాన నాటుకుపోయిన కుల దురాచారాన్ని ఈ పాటలో ప్రశ్నిస్తున్నట్టే విన్పిస్తుంది. అందమైన ఆ అక్షర కూర్పు, పాటలోని భావ గాంభీర్యం..ఆసాంతం ఆ గానం ఓసారి విందామా..!

పల్లవి

గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన గోధూళి ఎర్రన ఎందువలన
గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన గోధూళి ఎర్రన ఎందువలన
గోధూళి ఎర్రన ఎందువలన

చరణం

తెల్లావు కడుపుల్లో కర్రావులుండవా
ఎందుకుండవ్
కర్రావు కడుపున ఎర్రావు పుట్టద
ఏమో
తెల్లావు కడుపుల్లో కర్రావులుండవా
కర్రావు కడుపున ఎర్రావు పుట్టదా
గోపయ్య ఆడున్న
గోపెమ్మ ఈడున్న
గోధూళి కుంకుమై గోపెమ్మకంటదా
ఆ పొద్దు పొడిచేనా
ఈ పొద్దు గడిచేనా
ఎందువలన అంటే అందువలన
ఎందువలన అంటే దైవ ఘటన

చరణం

పిల్లనగ్రోవికి నిలువెల్ల గాయాలు
పాపం
అల్లనమోవికి తాకితే గేయాలు
పిల్లనగ్రోవికి నిలువెల్ల గాయాలు
అల్లనమోవికి తాకితే గేయాలు
ఆ మురళి మూగైనా ఆ పెదవి మోడైనా
ఆ గుండె గొంతులో ఈ పాట నిండదా
ఈ కడిమి పూసేనా
ఆ కలిమి చూసేనా

కె.వి.మహదేవన్ సంగీత సారధ్యంలో ఎస్. జానకి, ఎస్.పి. బాలసుబ్రమణ్యం ఆలపించిన ఈ పాట సాహిత్యం నిండైన అభ్యుదయం. అచ్చమైన శాస్త్రీయం. కవి ప్రకృతిలోని అందాలతో పోలిక పెట్టి అంతే సున్నితంగా సమాజాన్ని సవాల్ చేస్తారు. మందారపూల సుకుమారం..మల్లియల పరిమళం..పల్లెపదాల లాలిత్యం..భాషాభావం వేటూరి పాటవానికి నిదర్శనం.

పచ్చని పల్లెసీమ, తెల్లని ఆవులూ, నల్లని మేకలూ..వీటి ఆలనలో వున్న కాపరి వేషధారి, ఇద్దరు చిన్నపిల్లలతో రమణీయంగా పాట చిత్రీకరణ మొదలవుతుంది.. నదీ తీరాన ఓ చిన్న గ్రామం. కులమతాలకు తావివ్వని ఓ ప్రేమజంట. ఈ 'ప్రేమ'సుమాలు కులజాడ్యాన్ని పెంచి పోషించే పెద్దవాళ్ల అదుపాజ్ఞల్లో నలిగిపోతుంటాయి.

గోవుల్లు తెల్లన..గోపయ్య నల్లన..గోధూళి ఎర్రన..ఎందువలన? అంటే, గోవులు తెల్లగా వుంటాయి. వీటిని అమితంగా ప్రేమించిన కృష్ణుడు నల్లనివాడు. అలాగే 'తెల్లావు కడుపులో కర్రావులుండవా?' (కరి..అంటే నలుపు అని అర్థం) కర్రావు కడుపున ఎర్రావు పుట్టదా? అలాగే పొద్దుగుంకిన వేళ ఆవులన్నీ ఇంటికి చేరే సమయంలో వాటి అడుగులకు వెదజల్లే ధూళీ, అస్తమించే సూర్యుని కాంతికి మరింత ఎరుపురంగులో మారుతుంది. ఇలా తెలుపు, ఎరుపు, నలుపూ ఇన్ని రంగులు ఎందుకని..? ఇన్ని వర్ణాల్లో వున్న ఈ పశువులే కలిసిమెలిసి జీవిస్తుండగా, మనుషులకెందుకు ఈ వర్ణ వ్యవస్థ? ఈ కుల పంచాయతీ? అని ప్రకృతిలోని శాస్త్రీయతను జోడించిమరీ సమాజాన్ని కవి ప్రశ్నించారు.

'పిల్లనగ్రోవికి నిలువెల్ల గాయాలు..అల్లనమోవికి తాకితే గేయాలు..' పిల్లనగ్రోవికి వుండే ఏడు రంధ్రాలను గాయాలుగా అన్వయించి, నిలువెల్ల గాయాలున్నా , ప్రేమికుల గుండెల్లో బాధ వున్నా 'గొంతులో ఈ పాట నిండదా..' అని వేటూరి నిలదీశారు. అలాగే చివరన..'ఈ కడిమి పూసేనా..ఆ కలిమి చూసేనా..' అంటే 'కడిమి' పూలు..బహు అరుదుగా పూస్తాయట. కలిమి..అంటే ఐశ్వర్యం కూడా ఒకేసారి వచ్చి పడిపోదు ..అని భావయుక్తంగా ముగిస్తారు. గాయని జానకి చిన్నోడి గొంతుకలో ప్రశ్నలు మృదువుగా..మధురంగా వీనుల విందుగా..మళ్లీ మళ్లీ ఈ పాట వింటారుగా...!

- జి.రాజకుమారి, 9490099008

చిత్రకళ కేరాఫ్ తెలంగాణ

పి.టి.రెడ్డి పెయింటింగ్

తెలుగునాట చిత్రకళకు ఆలవాలం తెలంగాణ ప్రాంతం. గత రెండు మూడు దశాబ్దాల కాలంలో ఈ ప్రాంతంలో అనేకమంది చిత్రకారులు రూపొందారు. ఆధునిక చిత్రకళకు తెలంగాణ ప్రాంతీయ నిర్దిష్టతలతో కొత్త సొబగులు చేకూర్చారు. ఆర్ట్‌గ్యాలరీల్లోనూ హైదరాబాద్ చిత్రకారులదే హవా. జాతీయంగా, అంతర్జాతీయంగా తెలంగాణ చిత్రకారుల ప్రతిభను లోకానికి చాటే నెలవైంది తెలంగాణ. తెలంగాణ రాజధాని హైదరాబాద్ రంగుల రాజధానిగా విలసిల్లుతోంది. తెలంగాణ జిల్లాల్లో ఉండే అనేకమంది కళాకారులు హైదరాబాద్‌లోని గ్యాలరీల్లో చిత్రకళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు కూడా హైదరాబాద్‌లో స్థిరపడి బొమ్మలు వేస్తున్నారు. ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ చిత్రకళ విస్తరణకు దోహదం చేస్తున్నారు. అలాగే జిల్లాల్లోనూ అప్పుడప్పుడు కళాప్రదర్శనలు జరుగుతున్నాయి. గతంతో పోల్చుకుంటే చిత్రకళను ప్రవృత్తికే పరిమితం చేయకుండా, వృత్తిగా మార్చుకునే అవకాశాలు అనేకం. ఆర్థికంగా నిలదొక్కుకొని రాణించడానికి అనువైన అవకాశాలు ఇవాళ్టి చిత్రకారులకు ఉన్నాయి. అనూహ్యంగా గత రెండు దశాబ్దాలుగా చిత్రకళకు డిమాండ్ పెరిగింది. అందుకే హైదరాబాద్‌లోనే కాదు దేశంలోని ఇతర నగరాల్లోనూ, అంతర్జాతీయంగా అనేక నగరాల్లోనూ తెలంగాణ చిత్రకారుల బొమ్మలు నిత్యం ఎక్కడో ఒకచోట ప్రదర్శనలో ఉంటున్నాయి. తెలుగు చిత్రకళ అంటే తెలంగాణ చిత్రకళ అనుకునేంత విస్తృతి, వైశాల్యం చేకూరడం గమనార్హం. ప్రాంతీయ చైతన్యం కూడా తెలంగాణ చిత్రకళ వికాసానికి కొంతవరకు తోడ్పడింది. నిజానికి 'తెలంగాణ చిత్రకళ' అనే భావన ఈనాటిదీ కాదు. ఈ మాట అయిదారు దశాబ్దాల కిందటనే కొండపల్లి శేషగిరిరావు గారు ఉపయోగించారు. తెలంగాణ చిత్రకళ గురించి అరవై ఏళ్ళ కిందటనే వ్యాసాలు రాశారు. ప్రస్తుతం 'తెలంగాణ' భావన మన చిత్రకారులకు మరింత ఉద్దీపన ఇచ్చే నినాదం. ఈ నేపథ్యంలో తెలంగాణ చిత్రకళ తీరుతెన్నుల్ని అర్థం చేసుకోడానికి ఉపకరించే కథనమిది.

హైదరాబాద్ నగరంలో బాగ్‌లింగంపల్లిలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీతో మొదలుకొని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్ మొదలైన ప్రాంతాల్లో నిత్యం చిత్రకళా ప్రదర్శనలు జరుగుతున్నాయి.

తెలంగాణ చిత్రకారుల బొమ్మల ప్రదర్శన లేని రోజు లేదు. తెలంగాణ చిత్రకళకు అంతర్జాతీయ ఖ్యాతిని సమకూర్చిన చిత్రకారుల బొమ్మలు అనేక గ్యాలరీల్లో దర్శనమిస్తాయి. అయితే ఇంతటి ఉన్నతస్థాయిని అందుకున్న తెలంగాణ చిత్రకళ మూలాలు ఎక్కడున్నాయో చూస్తే విస్మయకరమైన అంశాలెన్నో కనిపిస్తాయి. అందుకే వర్తమాన స్థితిని పరికించే ముందు చరిత్రలోని తొలి జాడల్ని అన్వేషించాలి.

గుహల్లో చిత్రాలు

పూర్వ చారిత్రక యుగానికి చెందిన మానవుడు రాతి గుహలలోని గోడలపై తాను నిత్యం వేటాడే జంతువుల బొమ్మలను, పరిసర ప్రదేశాలలో దొరికే రంగురాళ్ళతోనూ, బొగ్గుతోనూ చిత్రించేవారు. ఇలాంటి గుహచిత్రాలు దక్కన్ ప్రాంతంలోని రాయచూర్ జిల్లాలో కనుగొన్నారు.

ప్రాచీన భారతీయ చిత్రకళ మాదిరిగానే, దక్కన్ ప్రాంతపు చిత్రకళ గురించి కచ్చితమైన సమాచారం ఏదీ మనకు తెలియకున్నది. క్రీ.పూ. రెండవ శతాబ్దం నాటి అజంతా గుహలే మన చిత్రకళకు మొదటి సాక్ష్యాధారాలుగా నిలిచిపోయాయి. ఇప్పుడు చిత్రలేఖనం 1, 2, 16, 17 విహారాల్లో, 9, 10 చైత్యాలలోనూ కనిపిస్తోంది. అయినా అజంతా చిత్రకళ, దక్కన్ చిత్రకళకు ప్రథమ ప్రయత్నం కాదని చెప్పవచ్చు. అంతకు పూర్వమే అపారమైన కృషి జరిగి, పరిణామం చెంది అజంతా నాటికి చిత్రకళ ఆ స్థాయి నందుకున్నది. అజంతాకు పూర్వపు చిత్రాలు మనకు లభ్యం గాకపోవడం మన దురదృష్టం.

కావ్యాలలో కాకతీయ చిత్రకళ

చిత్రకళకు ఆలయాలు గుహలు మాత్రమే కాదు, రాజ ప్రాసాదాలు, ధనికుల నివాసాలు, చిత్రాగారాలు, రాణివాసాలు, శయన మందిరాలు, స్నానగృహాలు, సూతికా గృహాలు కూడా వున్నాయి. ఇక మధ్యయుగాలకు సంబంధించి, కాకతీయుల చిత్రకళను గురించి కావ్యాల ద్వారానే వివరాలు మనకు తెలుస్తున్నాయి. మాచల్దేవి చిత్రశాలలో అనేక శృంగార చిత్రాల వర్ణన శ్రీనాథుని 'క్రీడాభిరామం'లో చూడొచ్చు. ఓరుగల్లు పతనం తర్వాత కాకతీయుల చిత్రకళ అంతరించిందనే చెప్పాలి. పిల్లలమర్రి దేవాలయంలో గర్భగుడి ముఖద్వారంపైనున్న 'క్షీరసాగర మథనం' కాకతీయ చిత్రకళా శైలిదని చెప్పలేం. శైవభేదం వల్ల అది తర్వాత కాలం నాటిది కావచ్చని చరిత్రకారులు భావిస్తున్నారు.

దక్కన్‌శైలికి తొలిపాదు

ఔరంగజేబు కాలంలో లలితకళలను అణచివేయడంతో చిత్రకారులు కొందరు దక్కన్‌కు, మరికొందరు బహుమనీ సుల్తాన్‌ల ఆశ్రయం కోసం వచ్చారు. అహ్మద్‌నగర్, బీజాపూర్, బీదర్, గోల్కొండ సుల్తానులు వారిని తమ గ్రంథాలయాలలో చిత్రాలు వేయటానికి నియమించారు. అప్పటికే వారి సంస్థానాలలో పనిచేస్తున్న చిత్రకారులు వీరి రాకతో మొగలు, పార్సీ సంప్రదాయ చిత్రకళను అనుసరించి ఒక కొత్త సంప్రదాయాన్ని సృష్టించారు. దీనికే తర్వాత దక్కన్ శైలి అనే పేరు వచ్చింది. ఈ



సి.జగదీష్ బొమ్మ

దక్కన్‌శైలిలో వెంకటాచలం, గరుడాద్రి అప్పయ్యలు ప్రసిద్ధులైన చిత్రకారులు. రెండవ నిజాం అలీఖాన్ అసఫ్‌జా దర్బార్‌లో వెంకటాచలం ఆస్థాన చిత్రకారుడిగా ఉండేవారు. ఇతను వేసిన నిజామాలీఖాన్ వేటకు వెళ్ళిన చిత్రం, నిజాం అలీఖాన్ రూపచిత్రం నేటికీ సాలార్‌జంగ్ మ్యూజియంలో కనిపిస్తాయి. వేములవాడ, గద్వాల, వనపర్తి సంస్థానాలలో చిత్రకళకు సంబంధించిన కృషి జరిగింది.

మారిన చిత్రకళారీతులు

రానాను నవాబులు, జాగీర్దార్లు, సంస్థానాధిపతులు ఆంగ్లేయులని అనుకరించడం ఎక్కువయింది. యూరోపియన్ చిత్రకారులు వచ్చి

అక్షయ్ ఆనంద్ చిత్రం

హైదరాబాద్ నవాబుల రూపచిత్రాలను వేసి, వారితో సత్కారాలు పొందారు. క్రమంగా సహజ చిత్రకళపై మోజు పెరిగి, దక్కన్ శైలిలో రూప పటాలను వేసే సంప్రదాయం నశించి, చిత్రకారులంతా జానపద చిత్రకారులయ్యారు.

దక్కన్‌శైలిలోని హైందవ చిత్రకళ మాత్రం జానపద కళలో జీర్ణించి యుండి ఆలయ చిత్రాలలో, తోలుబొమ్మలలో, ఇత్తడి, కంచు పాత్రల నిర్మాణంలో కాకిపడగల వారి పటాలలో వ్యక్తమైంది.

సర్ అక్బర్ హైదర్ ప్రధానమంత్రిగా వున్న కాలంలో 1940లో ఖాన్ బహద్దూర్ సయ్యద్ ప్రథమ ప్రిన్సిపాల్‌గా హైదరాబాద్‌లో ఒక స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ స్థాపించారు. హైదరాబాద్‌లో జరిగిన పోలీసు యాక్షన్, ఆంధ్రప్రదేశ్ నిర్మాణం.. రాజకీయ రంగంలోనేగాక కళా రంగంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. యువ చిత్రకారులు ఎక్కువగా చిత్రకళా ప్రపంచంలో కొనసాగుతున్న మోడరన్ మూవ్‌మెంట్ దిశగా మొగ్గు చూపారు. సంప్రదాయ చిత్రకారులు కూడా ఆధునిక శైలిని అనుసరించడం మొదలయింది. పి.టి.రెడ్డి లాంటి ప్రముఖ చిత్రకారుడు మోడరన్ ఆర్ట్‌లో ప్రఖ్యాతుడైన తర్వాత దాన్ని వదిలి, సంప్రదాయ కళను అవలంబించారు. మోడరన్ ఆర్ట్ మూవ్‌మెంట్‌లో దిగి అనేకమంది యువ చిత్రకారులకు అండగా నిలిచారు. తర్వాత తమదైన శైలిలో నిలదొక్కుకుని పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న చిత్రకారులలో సయ్యద్ బిన్ మొహమ్మద్, విద్యాభూషణ్, మధుసూదన్‌రావు, కొండపల్లి శేషగిరిరావు, రెడ్డెప్ప నాయుడు, లక్ష్మాగౌడ్, సూర్యప్రకాశ్, గౌరీశంకర్‌లు వున్నారు. దేవరాజ్

రచయితలు స్పందించాలి

తెలంగాణ చిత్రకళా రంగానికి సంబంధించి దాదాపు 150 మంది కళాకారుల బొమ్మలు ఒకచోట చేర్చడం ఆహ్వానించదగ్గ విషయం. 'ఆర్ట్ ఎట్ తెలంగాణ' పుస్తకం చూస్తే తెలంగాణ చిత్రకారులు అనుసరించిన వైవిధ్య పార్శ్వాలు బోధపడతాయి. మన చిత్రకళా సౌందర్యం గొప్పతనం తెలుస్తుంది. ఇంతమంది చిత్రకారుల్ని ఒకచోట చేర్చిన తొలి ప్రయత్నమిది. అయితే దీనిలో ఉండదగ్గ అర్హత కలిగినవారి బొమ్మలు లేకపోవడం మీద విమర్శలు వచ్చాయి. ఆ విమర్శలు అసంబద్ధమేమీ కావు. అయినప్పటికీ ఈ పుస్తకం రూపొందించడానికి పడిన శ్రమ చిన్నదేమీ కాదని గుర్తించాలి. బి.నరసింగరావు ప్రధాన సంపాదకులుగా వున్న ఈ పుస్తకానికి ఆర్ట్ కో ఆర్డినేటర్‌గా లక్ష్మణ్ ఏలే వ్యవహరించారు. తెలంగాణ చిత్రకళ సొగసులు ఆస్వాదించాలనుకునేవారికి ఉపకరించే పుస్తకమిది. అంతేగాక తెలంగాణ ప్రాంత చిత్రకారుల కళారీతుల అధ్యయనానికి ఇది మంచి ఉపకరణం. ప్రపంచంలో శతాబ్దాలుగా నెలకొన్న చిత్రకళారీతుల్ని మన చిత్రకారులు ఎంత ప్రగాఢంగా అధ్యయనం చేశారో కూడా ఈ బొమ్మలు చూస్తే తెలుస్తుంది. అంతేగాక ఒక్కొక్కరి నేపథ్యం, పూర్వపరాల గురించి చదివితే, సామాన్యులు ఎదిగివచ్చిన వైనం విస్మయం గొల్పుతుంది. చిత్రకళ కలిగినోళ్ళ సొత్తు కాదు. తపన వుండి, నిబద్ధతతో చిత్రకళా రంగంలో కృషి చేసేవారి సృజన అనితర సాధ్యమైన రీతిలో వ్యక్తం కావడానికి అవకాశాలున్నాయని అర్థమవుతుంది. అనేక కులాలకు చెందిన, ఆర్థికంగా దిగువస్థాయిలో వున్న నేపథ్యంలోంచి అంతర్జాతీయ చిత్రకారులుగా ఎదిగిన చిత్రకారులు తెలంగాణలో ఉన్నారు. అనేకానేక ఒడిదుడుకుల్ని, ఆటంకాల్ని, పరిమితుల్ని అధిగమించి చిత్రకళా ప్రపంచంలో తమదైన ముద్ర వేయడానికి ఒక్కొక్కరు శ్రమించిన తీరు గురించి రాస్తే ఒక్కొక్క నవల అవుతుంది. కాపు రాజయ్య, పి.టి.రెడ్డి, లక్ష్మాగౌడ్, వైకుంఠం, బైరు రఘురాం, గౌరీశంకర్, ఎక్కా యాదగిరిరావు, దేవరాజ్, బి.నరసింగరావు, రవీందర్‌రెడ్డి, యాసాల బాలయ్య వంటి చిత్రకారుల జీవితచరిత్రలు రావాలి. అసలు ఒక చిత్రకారుని జీవితాన్ని ఒక నవలగా రాసే ప్రయత్నం తెలంగాణ నవలాకారులు చేయాలి. కాపు రాజయ్య గురించి ఘనంగా చెబుతారు. కానీ ఆయన మీద ఒక్క పుస్తకం కూడా లేదు. నవలయినా రాయొచ్చు, లేదంటే ఆయన జీవితచరిత్రయినా రాయొచ్చు. తెలుగు పత్రికారంగానికి, చిత్రకళా రంగానికి దగ్గరి సంబంధాలున్నాయి. కానీ సాహిత్య ప్రపంచానికి చిత్రకారులతో సంబంధాలు అంతంతమాత్రమే. కేవలం తమ ముఖచిత్రాల బొమ్మలకు మాత్రమే చిత్రకారుల్ని వాడుకుంటున్నారు. ఇప్పుడయినా చిత్రకారుల కృషిని ఆవిష్కరించే రచనలు సాహిత్య ప్రపంచం నుంచి రావాలి.

కాపు రాజయ్య పెయింటింగ్

ఇచ్చింగ్‌లో ప్రత్యేకత సాధించారు. సిద్ధిపేటలోని కాపు రాజయ్య తెలంగాణ జానపదశైలిని అంటిపెట్టుకుని, దీనికి కొంత శాస్త్రీయ విలువను చేకూర్చి, నిరంతర కృషి చేశారు. రాజకీయవేత్తగా గుర్తింపు నొందిన సంగెం లక్ష్మీబాయమ్మగారు దేవీప్రసాద రాయ చౌధురి గారి శిష్యురాలనీ, మంచి చిత్రకారిణి అనీ చాలామందికి తెలియదు.

చిప్పా సుధాకర్ చిత్రం

చాలామంది చిత్రకారులు తమ బాల్యస్మృతులను, అప్పటి పల్లె వాతావరణాన్ని, ఆనాటి ప్రజల వేషభూషణాదులను చిత్రీకరించడమే ప్రత్యేకతగా నిలబెట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతికే ప్రాధాన్యతనిచ్చి బొమ్మలు వేసేవారు ఉన్నారు. తోట వైకుంఠం, యాసాల బాలయ్య, అగాచార్య, ఏలే లక్ష్మణ్, బి.నరసింగరావు, జగదీష్ మిట్టల్... ఇంకా దాదాపు రెండు వందల మంది చిత్రకారులకు పైగా తెలంగాణలో కనిపించడం విశేషం.

విలక్షణ సన్నివేశం

కళకు ప్రాంతం లేదు గానీ ఒక ప్రాంతం నుంచి రెండు వందల మందికి పైగా చిత్రకారులు రావడమంటే మామూలు విషయం కాదు. కొన్ని సామాజిక సందర్భాలు, సాంస్కృతిక సన్నివేశాలు తెలిసీ తెలియకనే ప్రభావం చూపుతాయి. అందుకే పేరొందిన కళాకారులే లేదు, అంతగా ప్రాచుర్యంలోకి రాని చిత్రకారులు ఎందరో ఇవాళ తెలంగాణ ప్రాంత ప్రత్యేకతల్ని తమ బొమ్మల్లో సృజిస్తున్నారు. 1956లకి ముందున్న తెలంగాణకీ, ఇవాల్టి తెలంగాణకీ నడుమ ఎంతో వ్యత్యాసం వుంది. అయితే కాలం గడుస్తున్న కొద్దీ తెలంగాణ సాంస్కృతిక చైతన్యం పదునెక్కింది. ఇతరేతర రంగాల్లో కనిపించే వివక్షను చిత్రకళారంగం త్వరగానే అధిగమించింది. గతంలో తెలుగు చిత్రకళ అంటే దామెర్ల రామారావు, అడవి బాపిరాజు పేర్లు మాత్రమే ఎక్కువగా వినిపించేవి. పాఠ్యగ్రంథాలలోనూ వారి ప్రస్తావన ఉండేది. కానీ క్రమక్రమంగా పరిస్థితులు మారాయి. కాపు రాజయ్య, నరేంద్రరాయ్, లక్ష్మాగౌడ్, గౌరీశంకర్, వైకుంఠం, ఏలే లక్ష్మణ్, రమణారెడ్డి, వంటి పేర్లు తరచుగా వినిపిస్తూ వచ్చాయి. దాదాపు పదేళ్ళ కిందటనే తెలుగు చిత్రకళలో 'తెలంగాణ చిత్రకళదే హవా అనే పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ రంగుల రాజధానిగా వాసికెక్కింది. ప్రముఖులైన తెలంగాణ చిత్రకారుల పేర్ల జాబితా రాయాలంటేనే ఇక్కడ రెండు పేజీలు కావాలి. కనుక పేర్ల ప్రస్తావన కాకుండా ఈ పరిణామ క్రమంలో ఎదిగివచ్చిన కళాకారుల రీతుల్ని గమనిస్తే అనేక విషయాల్లో వారు సాధించిన పరిణతి తెలుస్తుంది.

సాహిత్యం కన్నా చిత్రకళనే మిన్న

తెలంగాణ చిత్రకళ అన్నంత మాత్రాన చిత్రకారులందరి వస్తువు కేవలం తెలంగాణ కాదు. వీరిలో అనేకులు తొలుత తెలంగాణ జీవన వైవిధ్యాన్ని, వైశాల్యాన్ని అత్యద్భుతమైన రీతిలో చిత్రించినప్పటికీ అక్కడే నిలిచిపోలేదు. ఉదాహరణకు చిత్రకారునిగా లక్ష్మణ్ ఏలే ప్రయాణాన్ని పరిశీలిస్తే 'కదిరేనిగూడెం' దగ్గరే వుండిపోలేదు. ప్రపంచ చిత్రకళారీతుల్ని

అర్థం చేసుకున్న లక్ష్మణ్ బొమ్మల్లో వైవిధ్యం అపారం. తెలంగాణ జీవన పరంపరని విశిష్ట రీతిలో సృజించిన లక్ష్మణ్, తర్వాతి కాలంలో ఇతరేతర చిత్రకళారీతుల్ని అనుసరించారు. బహుళ కళారీతుల ప్రతిఫలిస్తాయి ఆయన బొమ్మల్లో. ప్రాంతీయ నిర్దిష్టతల్నించి విశ్వజనీనతను సంతరించుకున్నందున దేశదేశాలలో లక్ష్మణ్ బొమ్మలున్నాయి.

ఈవిధంగా చెప్పుకోవాలంటే ఇంకా అనేకులు మనకు కనిపిస్తారు. ఇవాళ అంతర్జాతీయంగా వైకుంఠం బొమ్మలకు ఉన్న డిమాండ్ ఎనలేనిది. వారి చిత్రకళారీతుల్లోనూ విలక్షణతలెన్నో. చిత్రకళా ప్రపంచంలో ప్రఖ్యాతి చెందిన పి.టి.రెడ్డి, కొండపల్లి శేషగిరిరావు వేసిన బొమ్మల్లో ఇతివృత్త వైశాల్యం అపారం. ముఖ్యంగా కొండపల్లి శేషగిరిరావు చిత్రకళారంగంలో చేసిన కృషిని గురించి అనేక పుస్తకాలు రావాలి. వారు బొమ్మలు వేయడానికి మాత్రమే పరిమితం కాలేదు. 1950లకి పూర్వం చిత్రకళ



లక్ష్మా గౌడ్ పెయింటింగ్

గురించి అనేక వ్యాసాలు రాశారు. వారి గురించి కొండపల్లి నీహారిణి అందించిన రెండు పుస్తకాలున్నాయి. కానీ శేషగిరిరావు గారు వేసిన బొమ్మల మీద మరిన్ని పరిశోధనలు జరగాలి. అంతేగాక వారు వేసిన వేలాది బొమ్మల్ని భద్రపరిచే ఏర్పాట్లు చేయడం ప్రభుత్వ బాధ్యత.

చిత్రకళావిమర్శ ఎక్కడ

తెలుగునాట చిత్రకళ అభివృద్ధి చెందింది కాని చిత్రకళా విమర్శ ప్రాథమికస్థాయిలోనే వుంది. అందుకనే తెలంగాణ చిత్రకళ ప్రత్యేకతల్ని విశ్లేషించే విమర్శకులు అరుదయ్యారు. నేటివిటీకి ప్రాధాన్యమిస్తూనే రియలిజం, నేచురిలిజం, క్యూబిజం, ఇంప్రెషనిజం, పోస్టు ఇంప్రెషనిజం, పోస్టు మోడ్రనిజం వంటి ధోరణుల్లో బొమ్మలు వేస్తున్న చిత్రకారులు తెలంగాణలో వున్నారు. ఏదో ఒక ధోరణికి మాత్రమే పరిమితం కాకపోవడం విశేషం. తమను తాము అప్‌డేట్ చేసుకుంటూ, నవీనరీతుల్ని సంతరింపజేసుకుంటూ చిత్రకళారంగంలో తమదైన ప్రత్యేకతల్ని చూపుతున్న చిత్రకారులు ఎందరో వున్నారు. ఇటీవలి విడుదలయిన 'ఆర్ట్ ఎట్ తెలంగాణ' కాఫీ టేబుల్ బుక్‌ని చూస్తే తెలంగాణ చిత్రకళారీతుల్లోని వైశాల్యం బోధపడుతుంది. దాదాపు 150 మందికి పైగా చిత్రకారుల బొమ్మలు ఇందులో వున్నాయి. వాటిని ప్రత్యేకంగా అధ్యయనం చేస్తే తప్ప తెలంగాణ చిత్రకారుల బొమ్మల్లోని శైలీరీతుల గురించి ఒక నిర్ధారణకు వచ్చే వీల్లేదు. ఈ పుస్తకంలోకి రాని మరికొందరు చిత్రకారులు చూపే వైవిధ్యం కూడా అనంతమైంది. ఉదాహరణకు చిత్ర, కూరెళ్ళ శ్రీనివాస్ వంటి చిత్రకారులు వేసిన వందలాది బొమ్మల్లో కనిపించే కోణాలు అనేకం. పాఠ్యపుస్తకాలకు బొమ్మలు వేయడంలో కూరెళ్ళ శ్రీనివాస్ చూపుతున్న వైవిధ్య ప్రతిభ ఆశ్చర్యం గొల్పుతుంది. ఈ ప్రతిభని అంచనా వేసి, వాటి విలువని చెప్పే చిత్రకళా విమర్శ అభివృద్ధి చెందాలి.

నిబద్ధులైన కళాకారులు

కాగా, కొత్తగా ఈ రంగంలోకి అడుగు పెట్టేవారికి తగిన ఆదరణ లభించే పరిస్థితులు ఉండటం మరో హర్షణీయ అంశం. ఆరంభంలో

చిత్రకళా రాజధాని

హైదరాబాద్‌లో దాదాపు ఇరవై ఆర్ట్ గ్యాలరీలున్నాయి. అనేకచోట్ల చిత్రకళా శిక్షణ శిబిరాలు తరచుగా జరుగుతున్నాయి. ఇటీవల 'ఆర్ట్ ఎట్ తెలంగాణ' ఉత్సవం పండగలా జరిగింది. ఇదేవిధంగా అంతర్జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనలు ఇక్కడ నిర్వహించాలి. అందుకు గ్యాలరీలని అభివృద్ధి చేయాలి. ఇతర నగరాల్ని వచ్చి ఇక్కడ కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు కొందరు చిత్రకారులు. అయితే జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ ప్రదర్శనలు నిర్వహించాలనుకునే తెలంగాణ చిత్రకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉండాలి. కనుక చిత్రకళకు అకాడెమీ అవసరం. అలాగే చిత్రకళ మీద పుస్తకాలు తీసుకురావాలి. రాయగలిగిన

లక్ష్మణ్ ఏలేటి పెయింటింగ్

వారిని ప్రోత్సహించాలి. తద్వారా చిత్రకళా విమర్శ అభివృద్ధి చెందుతుంది. ఆర్ట్‌ను వీక్షించే అభిరుచులు మెరుగు పడతాయి. అంతేగాక కొత్తగా శిక్షణా శిబిరాలు ప్రభుత్వమే నిర్వహించాలి. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ చిత్రకళ ప్రతిష్టను విస్తరింపజేయడానికి ప్రభుత్వపరంగా చేయాల్సింది ఎంతో వుంది. కొత్తతరం చిత్రకారులని ప్రోత్సహించే వాతావరణం నెలకొనాలి. లబ్ద ప్రతిష్టులైన వారి చిత్రాల్ని భద్రపరచడానికి ఒక మ్యూజియం అత్యున్నతస్థాయిలో ఉండాలి. 'హైదరాబాద్ ఆర్ట్ మ్యూజియం' ఒకటి ఏర్పడాలి. ఇలాంటి వాతావరణంలోనే తెలంగాణ చిత్రకళ ప్రత్యేకత ఇనుమడిస్తుంది.

నరేంద్ర రాయ్ చిత్రం

ఒడిదుడుకులు ఉన్నప్పటికీ తమ వైశిష్ట్యాన్ని కనబరిచే చిత్రకారుల మనుగడకు గ్యారంటీ ఉన్న రంగమిది. అయితే నిబద్ధత ఉండాలి. తమని తాము మెరుగుపరుచుకోడానికి నిరంతరం శ్రమించాలి. ఈ లక్షణం తెలంగాణ చిత్రకారుల్లో ప్రగాఢంగా కనిపిస్తోంది. అందువల్లనే తెలుగు చిత్రకళకు చిరునామా అనదగ్గ స్థాయిలో తెలంగాణ చిత్రకళ నిలిచింది. చిత్రకళా చైతన్యం కూడా మునుపటి కన్నా పెరిగింది. గ్యాలరీలు, అవార్డులు, ప్రోత్సాహక బహుమతులు అనువైన వాతావరణాన్ని ప్రోది చేస్తున్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా చిత్రాలకు మంచి డిమాండ్ వుంది. అందువల్ల చిత్రకళ విస్తరించి, వ్యాప్తి చెందుతోంది. తెలంగాణ సాయుధ పోరాటాన్ని చిత్రించిన బెంగాలీ చిత్రకారుడు చిత్తప్రసాద్‌ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ఆ స్ఫూర్తినీ, నిబద్ధతనీ, చైతన్యాన్నీ చూపే చిత్రకారులు తెలంగాణలో ఉన్నారు. సామాన్యులకు పట్టం గడుతున్నారు. పదునెక్కిన తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ఉద్దీపనగా నిలుస్తున్నారు. అంతేగాక సామాన్యస్థాయి నుంచి చిత్రకళా రంగంలోకి వస్తున్నవారే అనేకులు. కనుకనే తెలంగాణ జీవన దృశ్యాలు తెలంగాణ చిత్రకళలో అనంతమైన వైవిధ్యంతో అలరారుతున్నాయి. చిత్రకళపై సామాన్యుల అభిరుచులను సుసంపన్నం చేస్తున్నాయి. ప్రజల్లోంచి ప్రజల కోసం వచ్చిన కళగా భాసిల్లుతోంది. అందుకే 'తెలంగాణ చిత్రకళ' అన్న భావన ఒక బ్రాండ్ ఇమేజ్‌గా కొనసాగడానికి తెలంగాణ చిత్రకళకు ఒక అకాడెమీ ఏర్పడాలి. ఇది తెలంగాణ చిత్రకళా వికాసానికి మరెంతగానో దోహదం చేస్తుంది.

– కె.పి.అశోక్‌కుమార్, 97000 00948

జోక్స్ కార్నర్

ఎందుకంటే...?

శరత్: మహిళలు ఆల్కహాల్‌ను ఎందుకు అసహ్యించుకుంటారు?
శారద: ఎందుకంటే అది తాగిన తర్వాత ఎలుకల్లాంటి వాళ్ళ భర్తలు సింహాలుగా మారుతారని.

అతిజాగ్రత్త

కామేష్, శిరిష్, గోపాల్ ముగ్గురూ కారులో వెళుతున్నారు. కారు డ్రైవ్ చేస్తున్న కామేష్‌ను చూసి శిరిష్ గోపాల్‌తో ఇలా అన్నాడు.
శిరిష్: మీ ఫ్రెండ్‌కు ఏ విషయంలోనైనా కాస్త జాగ్రత్త ఎక్కువేమో కదా.
గోపాల్: ఎందుకు? ఎందుకలా అనుకుంటున్నావు?
శిరిష్: కారు నడిపేటప్పుడు కూడా తలకు హెల్మెట్ పెట్టుకొంటేనూ...!

ఓ మైగాడ్

అభిషేక్: మా టీచర్‌కి భక్తి ఎక్కువ మమ్మీ
తల్లి: అలాగని నీకు చెప్పిందా?
అభినవ్: లేదు నేనే కనుక్కున్నాను.
తల్లి: ఎలా?
అభినవ్: తను అడిగిన ప్రశ్నలకు నేను జవాబు చెప్పినప్పుడల్లా 'ఓ మైగాడ్... ఓ మైగాడ్' అని దేవుణ్ణి తలుచుకుంటుంది మమ్మీ.

నిరంతర శ్రోత



మోహన్: మా ఆవిడతో నేను ఏడాదిన్నరగా మాట్లాడలేదు తెలుసా?
సురేష్: ఎందుకూ?
మోహన్: ఆవిడకు అంతరాయం కలిగించడం ఇష్టం లేక.

తెలివైన మగాళ్ళు

బ్రహ్మచారి: తెలివైన పురుషులు మంచి భర్తలు కావాలనుకుంటారు.
సన్యాసి: తెలివైన పురుషులు మంచి భర్తలుగా నటించాలనుకుంటారు.

బాడ్మింటన్‌కు కొత్త వెలుగు

షటిల్ సంచలనం కిడాంబి శ్రీకాంత్

కిడాంబి శ్రీకాంత్..మొన్నటి వరకు ఓ అనామక, యువ బ్యాడ్మింటన్ ఆటగాడు. భారత బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌కు చిరునామా అయిన పారుపల్లి కశ్యప్‌ను జాతీయ చాంపియన్‌షిప్స్‌లో ఓడించి వెలుగులోకి వచ్చిన శ్రీకాంత్..నేడు ఇండియన్ షటిల్‌కు చిరస్మరణీయ విజయాన్నందించి స్టార్ అయ్యాడు. చైనా ఓపెన్ సూపర్ సిరీస్ ప్రీమియర్‌లో ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ లిన్ డాన్‌పై గెలుపొందిన శ్రీకాంత్..సూపర్ సిరీస్ నెగ్గిన తొలి భారతీయ పురుష షట్లర్‌గా రికార్డు సృష్టించాడు.

చైనా సూపర్ సిరీస్ నెగ్గిన శ్రీకాంత్ భారత బ్యాడ్మింటన్‌లో నూతన శకానికి నాంది పలికాడు. ఐదు సార్లు ప్రపంచ చాంపియన్, రెండు సార్లు ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ చైనా షట్లర్ లిన్ డాన్‌పై డ్రాగన్ గడ్డపైనే ఓడించిన శ్రీకాంత్..బ్యాడ్మింటన్ ప్రపంచాన్ని తనవైపునకు ఒక్కసారిగా తిప్పుకున్నాడు. వరల్డ్ నెం. లీ చాంగ్ వీ అంతటి షట్లర్‌కే లిన్‌డాన్‌ను ఓడించ సాధ్యం కాలేదు. అలాంటిది ర్యాంకింగ్స్‌లో టాప్ టెన్ దరిదాపుల్లో కూడా లేని యువ భారతీయ షట్లర్ బ్యాడ్మింటన్ లిన్'డాన్'ను వరస గేమ్‌లలో 21-19, 21-17తో మట్టికరిపించాడు. ఇదే టోర్నీలో మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ కూడా చాంపియన్‌గా నిలిచింది. ఒక సూపర్ సిరీస్ టోర్నీ మహిళల, పురుషుల సింగిల్స్ విభాగాల్లో భారత్ చాంపియన్‌గా నిలవటం ఇప్పటివరకూ ఇదే ప్రథమం. ఫైనల్స్‌లో శ్రీకాంత్ విజయం భారత బ్యాడ్మింటన్‌కు కేవలం మైలురాయి వంటిదే కాదు, ఇప్పటివరకూ షటిల్‌లో చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టినట్లు కూడా భావించాలి.

చైనా, మలేషియా, కొరియా, సింగపూర్ షట్లర్స్ ఉండగా సూపర్ సిరీస్ టైటిల్ భారత్‌కు రాదు.ఇది బ్యాడ్మింటన్ విమర్శకుల మాట.

పరిచయం

పేరు : కిడాంబి నమ్మల్‌వార్ శ్రీకాంత్

జన్మదినం : ఫిబ్రవరి 7, 1993

స్వగ్రామం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్

అమ్మానాన్నలు : కెవిఎస్. కృష్ణ, రాధ

సూపర్ సిరీస్ టైటిల్ : చైనా ఓపెన్

జాతీయ చాంపియన్‌షిప్స్ : 2013 విజేత

ప్రపంచ ర్యాంకింగ్ : 10

ఎగువ మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన శ్రీకాంత్‌ది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు. బాల్యంలోనే బ్యాడ్మింటన్ రాకెట్ పట్టిన కిదాంబి..నేడు భారత్‌కు తొలి సూపర్ సిరీస్ టైటిల్ అందించే స్థాయికి ఎదిగాడు. 2011 కామన్వెల్త్ యూత్ గేమ్స్‌లో రజతం (డబుల్స్), కాంస్యం (మిక్స్‌డ్‌డబుల్స్) పతకాలు సాధించి వెలుగులొకొచ్చాడు. అదే ఏడాది ఆల్ ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్స్‌లో విజేతగా నిలవటంతో వర్ధమాన షట్లర్‌గా పేరుతెచ్చుకున్నాడు. 2013లో థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రీలో లోకల్ స్టార్ వరల్డ్ నెం.8ను ఓడించి తొలి మేజర్ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. జాతీయ చాంపియన్‌షిప్స్‌లో స్టార్ షట్లర్ పారుపల్లి కశ్యప్‌పై గెలుపొంది నయా చాంపియన్‌గా అవతరించిన కిదాంబి..అక్కడ్నుంచి జోరుగా హుషారుగా విజయాలు సాధిస్తున్నాడు. ఈక్రమంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 10వ స్థానానికి ఎగబాకిన శ్రీకాంత్..టాప్ ఇండియన్ (పురుష) షట్లర్‌గా నిలిచాడు. జాతీయ చీఫ్ కోచ్ పుల్లె గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. శ్రీకాంత్ సోదరుడు నంద గోపాల్ కూడా ప్రోఫెషనల్ బ్యాడ్మింటన్ ఆటగాడు కావటం విశేషం.

విమర్శకుల నోటికి తాళం వేస్తూ ఈ అసాధ్యాన్ని యువ తెలుగు షట్లర్ శ్రీకాంత్ సుసాధ్యం చేశాడు. షటిల్ బ్యాడ్మింటన్‌లో సూపర్ సిరీస్ ట్రోఫీ అంటే టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో సమానం. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో శిఖరస్థానాన ఉండే ఆటగాళ్లందరూ సూపర్ సిరీస్ కోసం పోటీపడతారు. దీంతో సహజంగానే సూపర్ సిరీస్ కొట్టాలంటే ప్రతిభతో పాటు కఠోరశ్రమ కూడా ఉండాలి. ప్రత్యేకించి సింగిల్స్‌లో ఈ ఘనత సాధించటమంటే సాధారణ విషయం కాదు. ఇండియన్ సింగిల్స్ స్టార్ పారుపల్లి కశ్యప్ అందుకోని ఈఅరుదైన ఘనత 21ఏళ్ల యువ షట్లర్ సునాయాసంగా అందుకుని అందరిచేతా ఔరా..శ్రీకాంత్ అనిపించాడు.

ఆల్ ఇంగ్లాండ్ టైటిల్ కొన్నాళ్ల క్రితం వరకూ బ్యాడ్మింటన్ ప్రపంచకప్ అని చెప్పవచ్చు. ప్రతి షట్లర్ కెరీర్‌లో ఒక్కసారైనా గెలవాలని కోరుకుంటారు. కానీ సూపర్ సిరీస్‌లు ప్రవేశించాక సీన్ మారింది. క్రమంగా ఆస్థానాన్ని ఈటైటిల్స్ అందుకున్నాయి. ప్రకాశ్ పదుకొణే, పుల్లెల గోపీచంద్‌లు నిన్నటి తరం షట్లర్స్. వీరివురూ ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌గా నిలిచారు. వారు ప్రోఫెనషనల్స్‌గా ఉన్న కాలంలో సూపర్ సిరీస్‌లు లేవు. వీటిని ప్రవేశపెట్టిన తర్వాత శ్రీకాంత్ మినహా ఏ భారత ఆటగాడు ఇంతవరకు దీనిని నెగ్గలేదు.

- శ్రీనివాస్ దాస్ మంతటి, 9676340133

■ కథ : చింతపట్ల సుదర్శన్

'స్వచ్ఛే జనా సుఖినోభవంతు'

అది ఒక రాజ్యము. రాజ్యము అనుమాట దానికి సరిగ్గా పొసగదు. అది ఒక మహాసామ్రాజ్యము. అంగవంగ కళింగ కాశ్మీర కాంభోజ ఘూర్జర మహారాష్ట్ర సౌరాష్ట్ర మగధమంచాల వంటి అనేక రాజ్యములతో గూడి జంబూ ద్వీపంలో విరాజిల్లు సామ్రాజ్యమది. ఇట్టి మహాసామ్రాజ్యమును ఏలిక ఎవడయి వుండాలి? ఉత్తముడు ఉత్తమోత్తముడు, పురుషోత్తముడు ధీశాలి, ధైర్యశాలి అవక్ర విక్రపరాక్రమ సాహసోపేతుడై వుండి తీరాలి. అశేషజనవాహినిని ఆసేతుహిమాచాల పర్యంతము నివసించు సకలజనావళికి ఆదర్శ ప్రాయుడై వుండాలి. మాతృమూర్తుల్ని కన్నబిడ్డల్లా పితృపాదుల్ని కన్న కొడుకుల్లా ఏలాలి. స్త్రీ బాల వృద్ధులందరికీ సుఖశాంతులు ఇవ్వగలిగిన వాడయి వుండాలి.

మన అదృష్టం పుచ్చిపోక పండినది కనుక మనమిప్పుడు అట్టి రాజాధిరాజ రాజగంభీర రాజ చండ ప్రచండ దోర్దండుల వారి నివాసమునకు సమీపమున వున్నాము. సంధ్య పిలుస్తున్నందున వడి వడిగా గృహానికి బయలుదేరినాడు రవి. ఆకాశము ఎరుపెక్కినది. పక్షులు తమ తమ గూళ్ళకు తిరిగి వస్తూ కలకలం రేపుతున్నవి. ఇహనో ఇంకొంచెం వేచిన తరువాతనో నిశాకాంత తన నల్లటి జుత్తుతో లోకమును ముంచెత్తబోతున్నది. రండి వేగిరము. రాజ ప్రాసాదమునకేగి అచ్చట యేమి జరుగుతున్నది, వ్యవహారమేమి, కథయా కమామిషయా ఏమిటో పరిశీలించెదముగాక!

రాజావారి రహస్యమందిరము. ఉచితాసనము మీద రాజావారు సముచితా సనము మీద మంత్రివరేణ్యులు ఆసీనులై వున్నారు. వారేదో దీర్ఘాలోచనలో వున్నట్లు తోస్తున్నది. చీకట్లు నలు దిక్కుల నుండీ కమ్ముకొస్తున్నవి. పరిచారకులు వచ్చి దీపములు వెలిగించినారు. రాజావారు మీసములు దువ్వుచూ గడ్డము గోకుచూ వుండ మంత్రివారు తలపాగాను వూడబెరికి బట్టతల మీద గోకు కొనుచున్నారు.

వినండి వినండి విని తరించండి వారేమి మాటలాడుచున్నారు. వారి పెదవులనుండి మాటలు జాలువారుచున్నవి. విని తరించెదము రండి.

ఏమోయీ మంత్రిసత్తమా! మనము రాజ్యమునకు వచ్చిన నాటినుండి ఏమేమి ఘనకార్యములు సాధించినామో ప్రజలకు ఎరుక యైనదా? అని రాజావారు అడిగినారు.

ప్రజలు సర్వజ్ఞులు ప్రభూ! వారు ఎంతో తెలివిమీరియున్నారు. వారు ఎరుగని విషయమే లేదు అని సెలవిచ్చినారు మంత్రిగారు.

మరి ఇంకా వారు నా నామజపము చేయుట లేదేమి? నా పైన భజనలు, స్తోత్రములు ఎవరైనా రచించిరా లేదా? నా నామ సంకీర్తనము చేయు వారెవరైన కలరో లేరో? అని రాజావారు మీసము దువ్వుచూ ప్రశ్నించినారు.

ఏమి చెప్పను ప్రభూ! ఇది యొక పిదప కాలము. కలికాలము రాజులకు కలిసి రాని కాలము, కష్టకాలము. రాజులు ఏమి చేసియూ ప్రజలను సంతృప్తి పరచలేరు. ఎంత చేసిననూ ప్రజలు వెర్రి వెంగళప్పలయి మనలను అనుసరించిరారు అనినాడు మంత్రి బట్టతల మీద బొటన వేలుతో గీక్కుంటూ.

అటులయిన మనమేమి చేయవలెను. ఏమైనను సరే మన రాజ్యమున ప్రజలను వెర్రి వెంగళప్పలను చేసినగాని మన అధికారము సుస్థిరము కానేరాదు. మంత్రివి కనుక గోక్కునుటకు బొచ్చు రహిత గుండు యున్నది. గనుక నీవే ఏదో ఒక ఉపాయమునూ దుమునసుచు రాజువారు కిరీటమూడదీసి చెవిని మంత్రిగారి మూతికి అందించిరి.

ఇంత మాత్రమునకు కిరిటమూడ దీయనవసరం లేదు. మీ చెవి నా మూతికడ పారవేయనూ అక్కరలేదు. పైపెచ్చు యిది రహస్య

మందిరముగదా అనిన మంత్రితో

సరే! అట్లయితే ధగధగలాడే కిరీటమును తిరిగి ధరించుచున్నాను. చెప్పుడు అన్నాడు రాజు.

కలియుగమున పిదప కాలమనదగు ఈ కాలమును సంచలనముల కాలము అనియు అనుచున్నారు. రాజన్నవాడు ఏదియో యొక సంచలనము కలిగించి ప్రజల కళ్ళు తెరిపించవలె నదియే తరుణోపాయము అన్నాడు మంత్రి.

తక్షణమే ఏదో! ఒక గందరగోళమును లేదా సంచలనమును సృష్టించి చరిత్రలో నా పేరు సువర్ణాక్షరములలో లిఖించబడునట్లు చేయుమోయీ మంత్రి పుంగవా అన్నాడు రాజు.

అయిన ఈక్షణమే మనం రాజ్యమున తిరిగివత్తము. చీకటి పడుచున్నది. దొంగలు నగరమున తిరుగు వేళ అగుచున్నది. ఇదియే సుముహూర్తము. మనము మారు వేషములలో బయలు దేరి పోదాము. రాజావారూ తమరు అభ్యంతర మందిరమున కేగి ఏదియే ఒక దరిద్రగొట్టు వేషము ధరించిరండి. నాకే వేషమూ అక్కరలేదు. తలపాగా తీసివేసిన నాది నిజముగా నొక దరిద్రగొట్టు ముఖమే, యిక ఆలస్యం వద్దు వేగిరపడుడు అని రాజును లోపలి గదిలోనికి పంపినాడు మంత్రి.

రాజునూ మంత్రియూనూ మారు వేషములలో చీకట్లో తారట్లాడుతూ వీధులవెంట పడితిరిగి తిరిగి నగరి బయట వున్న ఒక్క గుడిశె ముందుకు చేరినారు. రండి అచ్చట యేమి జరుగుచున్నదో కందము, విందము రండి...రండి.

గుడిశెముందు మినుకు మినుకు మను దీపము కడ కండ్లు మూసుకుని పద్మాసనము వేసుకుని కూర్చుని వున్నాడొక్క మహానుభావుడు సన్యాసి జడధారి. మారు వేషమున నున్న రాజూ మంత్రి ఆయన ఎదుట నిలబడిన మరుక్షణం ఆ సాధువు కండ్లు తెరిచినాడు.

మహానుభావా! తమరెవ్వరు. ఇంతకుమున్ను ఎప్పుడూ మీ దివ్య దర్శనము కాలేదు. ఇచ్చట కెందుకు వచ్చినారు అని ప్రశ్నించాడు మంత్రి.

సన్యాసి మందస్మిత వదనార విందముతో ఆ యిరువురనూ పరికించినాడు. పిదప ఈ విధముగా పెదవి విప్పి పలికినాడు.

ఈ రాజ్యమునకు మా ముత్తాతకు బాదరాయణ సంబంధం వున్నదని తెల్సి మేరు పర్వతం మీద తపస్సును భగ్నం చేసుకుని వేంచేశాం మేం. ఈ రాజ్య సంక్షేమం కోరి వచ్చాం అన్నాడు సన్యాసి.

రాజూ మంత్రీ ముఖాలు చూచుకొన్నారు. అంతకంటే కావలసిన దేమున్నది. మేమునూ ఆ కారణమునకై దిమ్మరులమై తిరుగుచున్నాము. ఏమి చేయవలయునో సెలవియ్యండి అనడిగాడు మంత్రి.

సన్యాసి గంభీర వదనంతో ఈ రాజ్యమునకు ముగ్గురు శత్రువులున్నారు. వారెవరో కాదు చెత్త, మురికి, కంపు. వారిని వోడించిన గాని ఈ రాజ్యము బాగుపడి బట్టకట్టదు అన్నాడు.

స్వామీ తమరే మంటున్నారో మాకు అర్థమగుట లేదు అని గొణిగినాడు మంత్రి బట్టతల గోక్కుంటూ.

ఏమున్నది. విశదముగనే చెప్పితిని. చెత్త అనిన చెత్తయే. మురికి అనిన మురికియే. కంపు అనిన కంపుయే అని సన్యాసి కనులు మూసికొని మరి తెరువలేదు. అది ధ్యానమో మౌనమో గాఢ నిద్రయో అర్థం కాలేదు రాజకున్నూ మంత్రికున్నూ.

తెల్లవారు జామున కోటకు తిరిగి వస్తూ వున్న రాజావారి మీద ఎవరో పేడనీళ్ళు కొట్టిరి. మంత్రి గారి మీద బుట్టెడు కోడి బొచ్చు పడినది బెదిరి పరుగెత్తిన యిద్దరూ బురద గుంటలో పడి దొర్లి చచ్చీచెడి బయటపడి కోటకు చేరినారు. వారి శరీరముల నుండి వచ్చు రొచ్చుకంపు వాసనకు తాళలేక పరివారము వారు పారిపోయినారు.

సన్యాసి చెప్పినదీ, స్వానుభవమునవచ్చినదీ. కలిపి రాజావారు సంచలనానికి తెర ఎత్తినారు. రాజ్య సంక్షేమమునకు అడ్డుపడుతున్న శత్రువులను ఎదిరించ నిలిచినారు చీపురు కట్టతో, బకెట్టు నీళ్ళతో చిల్లి జగ్గుతో ఫినాయిల్ బుడ్డితో.

రాజుతలచుకొనిన దెబ్బలు కరువా! స్వయముగ రాజావారు వీధులందు చెత్తపూడ్చ సాగినారు. మురికి గుంటలలో చేయిపెట్టి కెలకసాగినారు. ముక్కుమూయకుండగ కంపును ఇంపుగా భావించ సాగినారు. సంక్షేమ సామ్రాజ్యమునకు పునాది స్వచ్ఛ సామ్రాజ్యమే నను సందేశమును ప్రజలకు అందించినారు. సందేశముతో పాటు చీపుర్లు, బక్కెట్లు జగ్గులు కంపు నింపుచేయు మందు బుడ్లు అందించినారు. స్వచ్ఛ సామ్రాజ్య సాధనకు చీపురే మహాయుధమని, వజ్రాయుధమని తెల్చి చెప్పినారు. ప్రతి పౌరుని చేతికి చీపురు అందినది. గృహములేమి, కార్యాలయములేమి, బహిరంగ స్థలములేమి, బాటలేమి పేటలేమి, ఉద్యానవనములేమి ఎక్కడ చూసిన చీపురు వీరంగమే బాట వెంట నడిచే ప్రతివాడు చీపురు ధరించి ఉండవలసిందే. బాట ఊడ్చుకుంటూ నడవ

వలసిందే. చీపురు ఒక సంచలనమై చలించ సాగింది. రాజ్యం పేరు చీపుర్ల రాజ్యమయింది. రాజావారు చీపురురాజా వారయ్యారు. ఎంత చేసినా, ఎంతెంత ఊడ్చినా చెత్తతరగలేదు. మురికి దారికి రాలేదు కంపు కంపుగానే ఉండినది.

చాలా కాలము తర్వాత రాజుకూ మంత్రికీ మునుపెప్పుడో నగరి బయట కనిపించిన సన్యాసి మళ్ళీ దర్శన మిచ్చినాడు. ఎంత శ్రమించినా చెత్త మురికి కంపులను జయించలేక పోవడమును గురించి విన్నవించినారు.

అప్పుడు సన్యాసి పకపకా నవ్వినాడు. చెత్తా మురికి కంపులపై విజయం సాధిస్తే సంక్షేమ రాజ్య మవుతుందని అన్న మాట నిజమే కాని ఎంత శుభ్రం చేసినా మళ్ళీ మళ్ళీ పేరుకు పోయే చెత్త మురికి కంపు కాదు నేను ప్రస్తావించినది. ఈ రాజ్యమున అవినీతి చెత్త లంచగొండితనం మురికి, పక్షపాతం కంపు. వీటిని పారదోలితేనే స్వచ్ఛతా, సంక్షేమం. మనుషుల్లో వున్న చెత్త మురికి కంపులను శుభ్రం చేయండి పొండి 'స్వచ్ఛే జనా సుఖినోభవంతు' అంటూ కనులు మూసికొనినాడు సన్యాసి.

రచయిత సెల్ : 9299809212

నైమిశిక

చుక్కల్లో దాగుంది ఎవరు?

చుక్కల్లో దాగున్నది ఎవరో తెలియాలంటే వరుస సంఖ్యలో చుక్కలు కలపాల్సిందే.



. ఎలుక దారి...

ఎలుక జున్నుముక్కను చేరే దారేది?



క్విజ్... క్విజ్....

1. బార్లీ పంట ఎక్కువగా పండే దేశం ఏది?
– రష్యా

2. మద దేశంలో మొట్టమొదటి ఆటమిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్ ఎవరు?
– డా॥ హెచ్.జె.భాభా

3. వరి ధాన్యం మీద పరిశోధనలు జరిపే సంస్థ ఎక్కడుంది? **– కటక్**

4. ఇండియా గేట్ ఎక్కడుంది?
– ముంబయ్

5. పత్తి పండించడానికి అనువైన నేల ఏది?
– నల్లరేగడి నేల

6. హిమాలయ పర్వతం ఎక్కడ వుంది?
– నేపాల్

జత చేద్దాం

ఇక్కడ వాహనాలు, అవి ప్రయాణించే మార్గాలు ఉన్నాయి. ఏ వాహనం ఏ దారి గుండా ప్రయాణిస్తుందో చెప్పండి.

జవాబు : 1–6, 2–8, 3–5, 4–7



రంగులతో అందంగా

ఇద్దరు శిష్యులు

హరి, గిరి ఇద్దరూ ఒకే గురువుగారి దగ్గర విద్యను నేర్చుకుంటున్నారు. హరి ఉదయాన్నే లేచి చదువుకుని గురువుగారికి కావలిసిన ఏర్పాట్లు చూసుకునవాడు. గిరి బద్ధకస్తుడు. ఆలస్యంగా నిద్ర లేచేవాడు. పైగా అన్ని పనులు తానే చేస్తున్నట్లు, హరి చేసే పనులు కూడా తనే చేస్తున్నట్లు గురువుగారిని నమ్మించేవాడు. అయితే హరి ఆ విషయాన్ని గురువుగారికి చెప్పేవాడు కాదు. ఎంత కాలం గడిచినా గిరి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఒకరోజు హరి గురువుగారు స్నానం చేయడానికి వేడినీళ్లు కాగబెట్టాడు. సరిగ్గా అదే సమయానికి గిరి నిద్రలేచి హడావుడిగా గురువుగారి దగ్గరకు వెళ్లి స్నానం చేయడానికి వేడి నీళ్లు సిద్ధం చేశానని చెప్పి ఆయన్ను తీసుకువచ్చాడు. అప్పుడే గురువుగారిని పిలుద్దామని వస్తున్న హరికి గిరి చేస్తున్నదేమిటో అర్థమైంది. కానీ ఆ సమయంలో ఆ విషయం గురించి ఏమీ మాట్లాడలేదు. ఎన్ని రోజులు గడిచినా గిరిలో మార్పు రాకపోవడం హరికి విసుగు తెప్పించింది. ఇక ఆలస్యం చేయకుండా గిరి విషయం గురువుగారికి చెప్పాలనుకున్నాడు హరి. ఓ రోజు నీళ్లు కాగబెట్టిన హరి ఆ పాత్రలో ఎక్కడో అడుగున ఒక చెంబెడు నీళ్లు ఉంచి మిగిలిన వన్నీ వేరే బక్కెట్లోకి ఒంపి ఎవరికీ కనిపించకుండా చెట్టు పొదలో దాచిపెట్టాడు. ఎప్పట్లాగే ఆలస్యంగా నిద్రలేచిన గిరి వేడినీళ్లు ఉన్నదీ లేనిదీ చూసుకోకుండా, గురువు గారిని సాన్నానికి పిలిచాడు. గురువుగారు వెళ్లి చూస్తే పాత్రలో నీళ్లు కనిపించలేదు. "గిరీ! వేడి నీళ్లు ఎక్కడ పెట్టావు. ఇక్కడ లేవు" అని అడిగారు. అసలు వేడి నీళ్లు ఉన్నాయో, లేవో కూడా చూసుకోకుండా గురువుగారిని పిలిచిన గిరికి నోట మట రాలేదు.

ఇంతలో పక్కనుండి హరి వేడినీళ్ల బక్కెట్ తీసుకుని వచ్చాడు. అసలు జరిగిన విషయం వారిద్దరి ముఖాలు చూసిన గురువుగారికి అర్థమైంది. "ఎదుటివారి శ్రమను నీదిగా చెప్పడం చాలా చెడ్డపని. వారినోటి దగ్గరి అన్నం తీసుకున్నంత తప్పు. ఇంకెప్పుడూ అలా చేయకు" అని గిరికి హితవు చెప్పి, మందలించారు గురువు గారు.

గురువుగారి మందలింపుతో తన ప్రవర్తన ఎంత తప్పుగా ఉందో తెలుసుకున్న గిరి, హరి దగ్గరికి వెళ్లి "స్నేహితుడివైన నీకు నేనెంత కష్టం, నష్టం కలిగించానో అర్థమైంది. ఇంకెప్పుడూ ఇలా చేయనని ఏడుస్తూ చెప్పాడు. స్నేహితుడిలో వచ్చిన మార్పుకు హరి సంతోషించాడు. అప్పటి నుండి ఇద్దరూ స్నేహంగా ఉండసాగారు.

ఆ గుడ్లగూబ ఏది?

ఈ ఐదు గుడ్లగూబల్లో ఒకటి మిగతావాటితో కలవదు. అది ఏదో గుర్తించారా?

జవాబు : 1

తేడాలు కనుక్కోండి

ఈ రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా కనిపించినా వాటి మధ్య పది తేడాలున్నాయి. అవి ఎక్కడెక్కడున్నాయో కనుక్కోండి.



■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

ప్రూధోను విమర్శించటంతో ప్రారంభించిన మార్క్స్ సూ గురించి చాలా ఎక్కువగా రాశాడు. ఎంగెల్స్ పరిచయంతో కలిగిన ప్రేరణ ఇందుకో కారణం కావచ్చు. లేదా గత సంవత్సరంగా తనలో సుళ్లు తిరుగుతున్న భావాలన్నీ కాగితం మీద పెట్టాలన్న కోరికా కావచ్చు.

జనవరి నాటికి ఇంకా పుస్తకం పూర్తి కాలేదు. ఆర్థికశాస్త్ర విషయాల గురించిన కృషి కూడా కొనసాగటం లేదు. ఈ ఆలస్యం గురించి ఎంగెల్స్ ఓ సలహా ఇచ్చాడు. 'పొలిటికల్ ఎకానమీ పుస్తకం త్వరగా ముగించు. చేసిన పని మనకు పూర్తిగా తృప్తి కలిగించకవపోచ్చు. అయినా పరవాలేదు. పని పూర్తి చేయటానికి ఏదో ఒక తేదీ నిర్ణయించుకుని అప్పటివరకు ఎలాగైనా సరే, ఎలాగున్నాసరే, ప్రచురణకు సిద్ధం చెయ్యి'.

అయితే, ఇటీవల పారిస్‌లో జరిగిన పరిణామాలు ఎంగెల్స్‌కు తెలియవు. తొమ్మిది రోజుల క్రితం ఫ్రెంచి హోంమినిస్టర్ ఒక ఆదేశం జారీ చేశాడు. దాని ప్రకారం ఇరవై నాలుగు గంటల్లోగా ఫార్వర్డ్ పత్రిక సిబ్బంది కొందరు – మార్క్స్, హైన్, రూగ్, బెర్నేస్, బకూనిన్ నగరం విడిచి వెళ్లాలి. ఆ తర్వాత దేశం నుండి కూడా నిష్క్రమించాలి. ప్రష్యన్ శాస్త్రజ్ఞుడు అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్, జర్మన్ రాజు ఫ్రీడ్రిక్ విల్హెల్మ్ ఇచ్చిన ఒక కానుకను లూయీ ఫిలిప్‌కు సమర్పించి ఈ 'నాస్తికులకు' దేశ బహిష్కరణ శిక్ష విధించమని కోరాడు. పొరుగు దేశంతో శాంతియుత సంబంధాలే అభిలషణీయం అనుకున్న ఫ్రెంచి రాజు ఈ దుందుడుకు రచయితల్ని ఫ్రాన్స్ నుండి పంపించి వెయ్యటానికి వెంటనే అంగీకరించాడు. జెన్నీ ప్రకారం, ఆదివారంనాడు పోలీస్ కమిషనర్ తమ అపార్టుమెంటుకు వచ్చి 'బహిష్కరణ ఆర్డర్' ఇచ్చి వెళ్లాడు.

ఇలాంటిదేదో జరుగుతుందని మార్క్స్‌కు తెలుసు. అయితే జెన్నీ మాత్రం పరిస్థితి ఇంతదాకా వస్తుందనుకోలేదు. పారిస్ ఆమెకు ఎంతగా నచ్చిందంటే ఇప్పుడామె 'పారిసియన్'గా మారిపోయింది. దంపతులుగా తాము కొత్త జీవితం ప్రారంభించిన నగరమది. అక్కడే కూతురు పుట్టింది. మిత్రబృందమంతా అక్కడే వుంది. 'బహిష్కరణ ఆదేశం'లో ఒక చిన్న వెలుగు రేఖ కనిపించింది. అందులో పేర్కొన్న వాళ్లందరూ 'ఇక ముందర రాజకీయాల్లో పాల్గొనం' అని హామీ ఇస్తే నగరంలో కొనసాగవచ్చు. మార్క్స్, బకూనిన్ తప్ప మిగతా వాళ్లందరూ అందుకు అంగీకరించారు. 'ఇది ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం. పోలీసు నిఘాకు లోబడి బతకలేను' అన్నాడట మార్క్స్. ప్రష్యాలో నిర్బంధాన్ని అనుభవించాడు. ఇక్కడ 'స్వేచ్ఛ' దొరికింది. ఒకసారి స్వేచ్ఛను రుచి చూసిన మనిషి ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని వదులుకోవటానికి సిద్ధపడడు.

చివరికి ఫిబ్రవరి 2, 1845 నాడు స్టేజ్‌కోచ్‌లో బయల్దేరి, ఫిబ్రవరి 5 నాటికి బ్రసెల్స్ చేరుకున్నాడు మార్క్స్. యువ జర్నలిస్టు హైన్రిష్ బర్గర్స్ తన వెంట వచ్చాడు.

జెన్నీ, పారిస్‌లోనే వుంది. హితైషులు అనేకమంది వచ్చి సానుభూతి వ్యక్తం చేశారు. కాని అప్పుడామెకు కావలసింది ఆర్థిక సాయం. కార్ల్ ఆమెకు 200 ఫ్రాంకులిచ్చి వెళ్లాడు. కేవలం ఇంటి అద్దె 380 ఫ్రాంకులు చెల్లించాలి. చేసేది లేక, ఎంత వచ్చినా చాలనుకుని ఫర్నిచర్ అమ్మేసింది జెన్నీ. మొత్తం మీద ప్రయాణానికి డబ్బు సమకూరింది. అనారోగ్యంతో బాధపడుతూ, బ్రసెల్స్ బయల్దేరింది జెన్నీ. జీవితమంతా దేశం నుండి దేశానికి చేసిన అనేక ప్రయాణాల్లో అది మొదటిది మాత్రమే.

బ్రసెల్స్, వసంతకాలం 1845

నియంతృత్వాల లాంటి రాజరికాలున్న యూరప్‌లో బెల్జియం కాస్త మెరుగు. హాలాండ్ నుండి విడిపడి పదిహేనేళ్ల క్రితమే స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. ఇక్కడా రాజున్నాడు. కాని రాజ్యాంగం కూడా వుంది. మిగతా యూరోపియన్ దేశాలతో పోల్చితే ఇక్కడి చట్టాలు కూడా సరళం. తళుకు బెళుకులు లేవు గాని (పారిస్ మహానగరమైతే ఇది చిన్న వూరు!) అంతకుమించిన స్వేచ్ఛా వాతావరణముంది. ఇక్కడికొచ్చే శరణార్థులు ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనకూడదనీ, బలమైన తమ ఇరుగు పొరుగు దేశాల ప్రభుత్వాలకు ఇబ్బంది కలిగించే పద్ధతిలో వ్యవహరించకూడదని మాత్రమే సూచించాడు లియోపాల్డ్ I ప్రభువు. నిజానికి, పారిస్‌లో ఇలాంటి నిబంధనలకే తను వ్యతిరేకమన్నాడు మార్క్స్. కాని 'వ్యక్తిగత', 'వృత్తి' కారణాల వల్ల బెల్జియంలో వాటినే అంగీకరించాడు. జెన్నీ మళ్లీ గర్భవతి. అదీగాక, పారిస్‌లో వున్నప్పుడే పొలిటికల్ ఎకానమీ గురించి ఒక పుస్తకం రాయటానికి కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు.

ఘనత వహించిన ప్రభువుల వారి 'మోస్ట్ ఒబిడియెంట్ సర్వెంట్'గా లియోపాల్డ్‌కు రాసిన లేఖలో 'నన్ను భార్యాపిల్లల్తో బెల్జియంలో వుండనిస్తే తాజా రాజకీయాల గురించి ఇక్కడ ఏమీ ప్రచురించనని వాగ్దానం చేస్తున్నాను' అని విన్న వించుకున్నాడు మార్క్స్. ఈ అభ్యర్థనను లియోపాల్డ్ అంగీకరించాడు. ఇక మార్క్స్ నిరభ్యంతరంగా బెల్జియంలో వుండవచ్చు. కాని, అంతమాత్రాన అతని మీద నిఘా వుండదని కాదు. 'ఈ ప్రష్యన్ ఆందోళనకారుణ్ణి ఓ కంట కనిపెట్టి వుండాలని' ఫ్రెంచివాళ్లు బెల్జియన్ అధికారులను కోరారు. 'ప్రష్యన్ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే ఏ చర్య మీ దృష్టికి వచ్చినా మాకు సమాచారమివ్వండి' అని బ్రసెల్స్ మేయర్‌కు వర్తమానమందింది. ఆ తర్వాత, కొంతకాలానికే వాళ్ల అనుమానం కాస్తా నిజమైంది. రాజకీయాల గురించి రాయనని వాగ్దానం చేసిన మార్క్స్, కొన్నాళ్ల తర్వాత యూరోపియన్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన విప్లవ కార్యాచరణ ప్రణాళిక 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' ప్రచురించాడు.

జెన్నీ కూడా ఈ ఒడుదుడుకుల జీవితం నుండి విముక్తి కోరుకుంది. పారిస్ నుండి మార్క్స్ బయల్దేరుతున్నప్పుడు బ్రసెల్స్‌లో తనకేం కావాలో ఒక లిస్టు రాసిచ్చింది. రాజరికాలకు ముగింపు పలకాలని, రాజులను తుదముట్టించాలని పిలుపునిచ్చిన మార్క్స్‌కు "బీరువాలు, కబర్డ్స్ చాలా ముఖ్యం. వంట సామాను గురించి అంతగా ఆలోచించక్కర్లేదు. కనీసం నాలుగ్గదులు, కిచెన్ వున్న ఇల్లు

కావాలి. అదనంగా, అక్కర్లేని వస్తువులు దాచుకోవటానికి మరో గది... కనీసం మూడు గదుల్లో హీటింగ్ వుండాలి. నువ్వు పని చేసుకునే గదిలో అవసరమైన ఫర్నిచర్ అమర్చుకోవాలి...' అంటూ సలహాలిచ్చిందా ఇల్లాలు. తమ దేశదిమ్మరి బతుకు ఇప్పటికైనా ముగించి ఎక్కడోచోట స్థిరంగా వుండాలని ఆమె కోరిక.

కాని, బ్రసెల్స్ చేరినా, పరిస్థితిలో ఏ మార్పూ రాలేదని గ్రహించింది జెన్నీ. కార్ల్ ఇల్లు వెదకలేదు. తనూ, జెన్నీచెన్, పాలదాయి ఒక బోర్డింగ్‌హౌజ్‌లో ఉన్నారు. అయితే, పారిస్‌తో పోల్చితే ఇక్కడి జీవితం చాలా ప్రశాంతంగా వుంది. మార్క్స్ అంటే గిట్టనివాళ్లు అతని చుట్టూ వున్న వాళ్లకు 'మార్క్స్ పార్టీ' అని పేరు పెట్టారు. నిజానికి, అతని వెంట వున్న వ్యక్తుల సంఖ్య అంత ఎక్కువేమీ లేదు. అయితే, ఈ 'పార్టీ' సభ్యులందరూ మొదటిసారి బ్రసెల్స్‌లో సమావేశమయ్యారు.

మార్క్స్, బ్రసెల్స్‌కు చేరిన వెంటనే కవి ఫెర్డినాండ్ ఫ్రైలిగ్రాత్‌ను వెదికి పట్టుకుని, ఆయనకు క్షమాపణ చెప్పటానికి బయల్దేరాడు. మూడేళ్ల క్రితం, తను రైనిష్ జైటుంగ్‌కు సంపాదకుడుగా వున్నప్పుడు అతడి పట్ల దురుసుగా వ్యవహరించాడు. అప్పటికి, వృత్తిరీత్యా వ్యాపారస్తుడిగా వున్న ఫ్రైలిగ్రాత్, జర్మనీలోని ప్రముఖ కవుల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. (వ్యాపారస్తుడు గనక, ఆ విషయంలో ఎంగెల్స్‌కు అతడు ప్రేరణ.) హెర్వీగ్‌లాగ అతడికి రాజకీయ కారణాల వల్లగాక కేవలం కవిత్వం వల్ల పేరొచ్చింది. 'కవులు ఈ లౌకిక విషయాలకు పెద్దగా స్పందించకూడదు' అంటూ ఒకసారి హెర్వీగ్‌తో తగాదా కూడా పెట్టుకున్నాడు. 1842లో ప్రష్యన్ రాజు ఆయనకు భరణం ప్రకటించటంతో రైనిష్ జైటుంగ్ ఫ్రైలిగ్రాత్‌ను 'స్వేచ్ఛకు శత్రువు'గా ప్రకటించింది.

ఆ తర్వాతి రెండేళ్లలో ప్రష్యన్ ప్రభుత్వం మరింత రియాక్షనరీగా మారటంతో ఫ్రైలిగ్రాత్ కవిత్వం కూడా రాజకీయ రంగు సంతరించుకుంది. 1844లో ఆయన పుస్తకం 'పేట్రియాటిక్ ఫాంటసీస్'ను నిషేధించారు. ఫ్రైలిగ్రాత్ తన రాజభరణాన్ని తిరస్కరించాడు. రాజుగారికి కోపం వచ్చింది. ఫ్రైలిగ్రాత్, ప్రష్యా విడిచి బెల్జియం చేరుకుని భార్యతో ప్రశాంతంగా గడుపుతున్నాడు. మార్క్స్ దంపతులు బ్రసెల్స్ చేరేనాటికి అదీ అతడి పరిస్థితి. త్వరలోనే రెండు కుటుంబాల మధ్యా స్నేహం పెరిగింది.

ఆ తర్వాత కొద్దికాలానికే ఫ్రైలిగ్రాత్ స్విట్జర్లాండుకు వెళ్లిపోయాడు. మార్క్స్ కూడా కొత్త ఇంటికి మారాడు. అనేకమంది పాత, కొత్త మిత్రులతో కళకళలాడిందా మూడంతస్తుల భవనం. అయితే, అక్కడ మార్క్స్ జీవితంలో భాగస్వాములుగా ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. ఒకరు హెలెన్ డిమూత్, మరొకరు ఎంగెల్స్.

జెన్నీ కన్నా ఆరేళ్లు చిన్నది హెలెన్. అంటే, మార్క్స్ కన్నా రెండేళ్లు చిన్న. మార్క్స్ ఇంట్లో అందరూ ఆమెను 'లెంచెన్' అని పిలుస్తారు. పదకొండేళ్లున్నప్పుడే ఆమె వెస్ట్ ఫాలెన్‌ల ఇంట్లో పనిమనిషిగా కుదిరింది. జెన్నీ, ఎడ్గార్, కార్ల్‌తో చనువెక్కువ. 1845లో జెన్నీ రెండవసారి గర్భం దాల్చిన తర్వాత, ఇద్దరు పిల్లలతో ఒక్కతీ చేసుకోలేదని, జెన్నీ తల్లి లెంచెన్‌ను కూతురి వెంట బ్రసెల్స్‌కు పంపింది. కొత్త వూరికి చేరిన వెంటనే ఇంటి పని బాధ్యతంతా తన మీద వేసుకుంది లెంచెన్. జెన్నీకి విశ్రాంతి మాత్రమే కాదు, భర్తకు సాయం చెయ్యటానికి కూడా సమయం దొరికింది. లెంచెన్ రాజకీయ అభిప్రాయాల గురించి మనకేమీ తెలియదు గాని, ఇంటికి వచ్చే కమ్యూనిస్టులు, సోషలిస్టులతో కలిసిపోయి వాళ్ల కుటుంబంలోని ఒక ముఖ్య వ్యక్తిగా మారిందామె. ఆ ఇంట్లో ఎవరూ ఆమెను పరాయి వ్యక్తిగా చూడలేదు. 'పెళ్లి చేసుకోవడానికి అనేక అవకాశాలు వచ్చినా, మార్క్స్ దంపతులతో వుండటానికే ఇష్టపడిందామె' అన్నాడొక కుటుంబ సన్నిహితుడు.

ఆ సమయంలో లెంచెన్ అక్కడికి రావటం మంచిదైంది. ఎంగెల్స్ రాకతో గందరగోళంగా తయారైన ఇంటిని ఓ పద్ధతిలో పెట్టిందామె. మార్క్స్ వుంటున్న ఇంటి పక్కనే మరో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు ఎంగెల్స్. కాని ఇంచుమించు సమయమంతా ఇక్కడే గడిపేవాడు. ఎనిమిది నెలల క్రితం పారిస్ వదిలిన తర్వాత ఇంటికెళ్లి (conditions of the woring class in England) ముగించాడు. (అందులో ఇంగ్లీష్ బూర్జువా వర్గం ఫ్యాక్టరీలలో హత్యలు, దోపిడీలు, ఇతర నేరాలకు పాల్పడింది' అని రాశాను అని మార్క్స్‌కు చెప్పాడు.) ఇంటి దగ్గర తండ్రితో తగాదా పెట్టుకున్నాడు. కొడుకు ధోరణి తండ్రికి నచ్చలేదు. పెద్దాయన మనసు బాధ పెట్టకూడదని ఫ్యాక్టరీ వ్యవహారాలు చూడటానికి అంగీకరించాడు. అయినా మార్క్స్‌కు రాసిన ఒక లేఖలో 'ఫ్యాక్టరీకి వెళ్లాలంటేనే అసహ్యమేసింది. అంతకాలం వృథా చెయ్యటమే నచ్చలేదు. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పనిచేసే బూర్జువాను నేను. ఆ అమానుషత్వాన్ని తలచుకుంటేనే జుగుప్స కలుగుతుంది.

ఆ తర్వాత, ఉద్యోగం మానేసి, (ఇప్పుడు తనకు ఫ్యాక్టరీతో ఏ సంబంధమూ లేదు) మోజెస్‌హెస్‌తో కలిసి రైన్‌లాండ్‌లో కమ్యూనిస్టు ఉద్యమంలో చేరాడు. సహజంగానే ఈ కార్యకలాపాలు పోలీసుల దృష్టినాకర్షించాయి. 'సాహిత్యకుని ముసుగులో తిరిగే కరడు కట్టిన కమ్యూనిస్టు' అని ఎంగెల్స్ గురించి రిపోర్ట్ చేశారు. కొడుకు అరెస్టయితే, కుటుంబం పరువు పోతుందని భయపడ్డ తండ్రి డబ్బులిచ్చి మరీ బ్రసెల్స్‌కు పారిపొమ్మన్నాడు. ఎంగెల్స్‌కు కావలసింది కూడా అదే. ఎలాగైనా బ్రసెల్స్‌కు చేరుకోవాలనే తన కోరిక.

అక్కడికి వెళ్లటానికి ముందే, 'సైద్ధాంతిక విషయాలు కట్టిపెట్టి కార్యాచరణ మీద దృష్టి పెట్టాలి' అని మార్క్స్‌కు స్పష్టం చేశాడు ఎంగెల్స్. మే నెలలో 'ఇంగ్లిష్ వర్కింగ్ క్లాస్' పుస్తకం జర్మనీలో ప్రచురితమవుతుంది. 'దాని మీద వచ్చే రాయల్టీ అంతా ఇచ్చేస్తాను. కనీసం అలాగైనా మీకు కుటుంబ భారం కొంత తగ్గుతుంది. మా నాన్న పంపించే డబ్బులతో నేను సుఖంగానే బతకగలను' అని కూడా ధైర్యం చెప్పాడు.

ఇంత ఉత్సాహవంతుడైన యువకుడు తనకు మిత్రుడిగా దొరకటంతో పొంగిపోయాడు మార్క్స్. జెన్నీ కూడా సంతోషించింది. (ఇన్నాళ్లూ ఎంగెల్స్‌కు 'మిసెస్ మార్క్స్' పేరు వింటేనే బెరుకు) ఇక ఎంగెల్స్ - కార్ల్‌తో కలిసి పని చేయాలనుకుంటే జెన్నీతో కూడా సఖ్యతగా ఉండక తప్పదు. మార్క్స్‌కు ఆమె కుడి భుజం- అక్షరాలా. మార్క్స్ డ్యూయెల్‌లో గాయపడ్డాడని విన్నప్పుడు ఇక అతడు రాయటానికి చేయి సహకరించకపోతే, తను అతనికి రాసి పెడతామనుకుంది. ఇప్పుడు మార్క్స్ నివాసమే మిత్రులందరికీ కేంద్రం. ఇదీ ఒకందుకు మంచిదే అనుకుంది జెన్నీ. పారిస్‌లో లాగ, ఇప్పుడతడు రాత్రుళ్లు మీటింగులంటూ ఎక్కడెక్కడికో తిరిగి రానక్కర్లేదు. ఇంటికొచ్చిన వాళ్ల యోగక్షేమాలు కనిపెట్టి చూసుకుంటుంది 'మిసెస్ మార్క్స్'.

ఇంట్లో పెద్దగా సదుపాయాలేమీ లేవు. అయినా ఉన్నదాంట్లో అందరూ సుఖంగానే ఉన్నారు. ఎవరి దగ్గర ఏదున్నా అందరూ పంచుకుంటారు. వచ్చినవాళ్లతో సహా కలసి భోజనం చేస్తారు. కలిసి ఆటలాడతారు... కలిసి 'తాగుతారు'.

1845వ సంవత్సరం యూరోప్‌కు శాపంగా పరిణమించింది. చేతికొచ్చిన పంట పాడైంది. బంగాళాదుంపకు చీడ పట్టింది ఐర్లండ్‌లో ప్రారంభమైన ఈ చీడ యూరోప్ అంతటా విస్తరించింది. ఆహార నిల్వలు తగ్గిపోయాయి. ఇన్నాళ్లూ భూమిని నమ్ముకుని బతికిన రైతులు, పొట్ట చేత పట్టుకుని కూలీ కోసం నగరాలకు వలస వచ్చారు. అంతమాత్రం చేత ఇక్కడ పరిస్థితి బాగుపడుతుందని నమ్మకం లేదు. ఎక్కడైనా ఆకలి చావులే. ప్రయాణ ఖర్చులు భరించగలిగిన వాళ్లందరూ వలసపోయారు. ఆ ఒక్క సంవత్సరమే లక్షమంది అమెరికా (U.S.A) వెళ్లారు. అది ప్రారంభం మాత్రమే. ఆ తర్వాత మరెన్ని లక్షల మంది అక్కడికి శరణార్థులుగా చేరుకున్నారో! పొలాలను విడిచి వచ్చిన వాళ్లు ఎక్కువ దూరం ప్రయాణించలేక, దగ్గరగా వున్న నగరాల్లో తమ అదృష్టం వెదుక్కున్నారు. ఊళ్లనూ, నగరాలనూ కలిపే దారులు, వలస వస్తున్న జనాలతో, బళ్లతో కిక్కిరిసిపోయాయి. వ్యాధులు ప్రబలాయి. నేరాలూ, వ్యభిచారమూ, సర్వసాధారణమైపోయాయి. పిల్లల్ని అమ్ముకోవటం కూడా పెరిగింది. పరిశ్రమల యజమానులకు ఇదో ఊహించని వరం. కూలీ ఇవ్వక్కర్లేదు. రొట్టె ముక్కలకైనా పనిచేస్తారు పిల్లలు. వ్యవసాయం పూర్తిగా నాశనం కావటంతో అల్లర్లు చెలరేగే ప్రమాదం పొంచి ఉంది.

(సశేషం)

■ స్ఫూర్తినిచ్చిన గురువు

గుర్తుండిపోయిన నర్సయ్య సార్

భావి భారతదేశ భవితను తీర్చిదిద్దేది నేటి విద్యార్థులు. తల్లిదండ్రుల తర్వాత ఆ విద్యార్థుల్ని తీర్చిదిద్దగలిగేది అధ్యాపకులు. జీవన సంధ్యకు చేరుకోబోతున్న నాకు ఈ సూత్రం అక్షరాలా, నూటికి నూరుపాళ్లూ నిజమనిపిస్తుంది.

అవి నా బాల్యపు రోజులు. నాలుగవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు మాకు నర్సయ్య సార్ విద్య గరిపారు. నర్సయ్యసార్‌ను గుర్తుతెచ్చుకుంటే, ఇప్పటికీ కృతజ్ఞతాభావంతో మనసు బరువవుతుంది. గుర్తుకు వచ్చిన ప్రతిసారీ నాలో నేనే మౌనంగా చేతులెత్తి నమస్కరించకుండా ఉండలేను.

తెలుగు, హిందీ, చరిత్ర భూగోళశాస్త్రం.. ఇలా అన్ని సబ్జెక్టులూ అవసరాన్ని బట్టి బోధించేవాడు. ఎంచుకున్న ప్రతి సబ్జెక్టుల్లోని పాఠాల్ని విడమర్చి, క్లాసులో మొద్దబ్బాయికి కూడా అర్థమయ్యేటట్టు చెప్పేవారు. పాఠం చెప్పాక, ఇంకో ఐదు నిముషాల్లో పీరియడ్ అయిపోతుందనగా, ఆ రోజు చెప్పిన విషయాన్ని సారాంశంగా మళ్లీ ఓ సారి చెప్పేవాడు. అందువల్ల పాఠాలు విద్యార్థుల మనసుల్లో గాఢంగా నాటుకుపోయేవి.

క్రాపు, ప్యాంటు, బుష్‌కోటు, బూట్లూ ఫాషన్ అయిన ఆ రోజుల్లో నర్సయ్య సార్ మాత్రం గుండు, వెనక పిలక, నుదుటన కాసంత కుంకుమ బొట్టు, ఖాదీ లాల్చీ, ముతక ధోవతితో హిందూ ఆహార్యానికి ప్రతీకగా కనిపించేవారు. ఎవరు ఇంటికి రమ్మని పిలిచినా ధనిక, పేద తారతమ్యం లేకుండా వచ్చేవారు. కాఫీ, టీలు ఇస్తే తిరస్కరించేవారు. పాలు, మజ్జిగ మాత్రమే పుచ్చుకునేవారు. అప్పట్లో మా అజ్ఞానం వల్ల నర్సయ్య సార్ గంజి తాగుతారని ఎద్దేవా చేసేవాళ్ళం. పదివేలకు మించని జనాభా (ఆనాడు) ఉన్న ఆ ఊళ్లో కొద్ది మందిమాత్రమే తమ పిల్లల్ని బడికి పంపేవారు. కనుక ఈ విద్యార్థి తండ్రి ఎవరో ఆయనకు బాగా తెలుసు. మా పేర్లు గుర్తుండకపోవడమో, మరే కారణమో తెలియదు కానీ, మమ్మల్నందర్నీ 'ఫలానా ఆయన వారి అబ్బాయి' అని సంబోధించేవారు. ఆయన మా మీద ప్రేమ చూపించినా, శిక్ష వేసినా గాఢంగానే ఉండేది.

ఆయన మాకు బోధించిన సబ్జెక్టుల్లోకెల్లా భూగోళశాస్త్రంపై ఆయనకున్న పట్టు, అవగాహన మాకు ఆశ్చర్యం కలిగించేది. ఉదాహరణకు ఆయన యూరోప్ ఖండం గురించి చెప్తున్న సందర్భంలో బ్లాక్ బోర్డుమీద యూరోప్ మ్యాప్ తగలించి, మా వైపు తిరిగి 'ఒరే... పిల్లలూ.. యూరోప్‌లో జర్మనీ రాజ్యం ఇక్కడ ఉండేది" అంటూ వెనక్కి తిరక్కుండానే చేతిలోని కర్రతో సరిగ్గా జర్మనీ దేశాన్నే చూపించేవారు.

కొన్నాళ్లకు మా నర్సయ్య సార్‌కు బదిలీ అయింది. ఆయనకు వీడ్కోలు పలకడానికి ఊరందరూ ఆయన వెంట మేళతాళాలతో బస్టాండ్‌కు తరలింది. బంధువు కాని ఒక వ్యక్తిని సాగనంపడానికి మా ఊళ్లో అంతమంది రావడం... నా డెబ్బయ్యేళ్ల అనుభవంలో ఎప్పుడూ చూడలేదు.

ఆశ్చర్యం ఏమిటంటే.. ఆయన్ను ఏవేవో పేర్లుపెట్టి ఎద్దేవా చేసిన నా సహ విద్యార్థులు బస్టాండుకు రావడమే కాదు, ఆయన లగేజీని బస్సు పైకి ఎక్కించడానికి సాయం చేశారు. ఆరోజు మాలో ఎవ్వరికీ కళ్లమ్మడి నీళ్లు ఆగలేదు. కొందరు బయటపడితే, మరికొందరు లోలోనే ఏడ్చేశారు. ఆయన కూడా బస్సు ఎక్కేటప్పుడు మమ్మల్నందర్నీ పేరుపేరునా పలిచి 'బాగా చదువుకోవాలి. ఊరికీ, మీ అమ్మానాన్నలకు పేరు తేవాలి' అంటూ బరువెక్కిన మనసుతో బస్సు ఎక్కడం మా స్నేహ బృందానికి ఇప్పటికీ గుర్తే.

ఏ ఊరి వాడో, రిటైరయిన తర్వాత ఎక్కడ స్థిరపడ్డారో, ఆయన పిల్లలు ఇప్పుడేం చేస్తున్నారో... ఏమీ తెలీదు. ఇల్లూ వాకిలి లాంటివి సమకూర్చుకున్నట్లు మాకెవరికీ తెలీదు. మళ్లీ ఆయన్ను చూడలేదు. పై చదువుల నిమిత్తం, ఉద్యోగావసరార్థం నేను మా ఊళ్లో ప్రవాసినయ్యాను.

ఇప్పుడు ఊరు వంద రెట్లు పెరిగింది. అక్కడికి వెళ్లగలిగిన సందర్భాలు తక్కువ. అయినా బాల్య స్నేహితులందరి మనసుల్లో నర్సయ్య సారు ఇంకా గూడుకట్టుకుని ఉన్నారు.

– కూర చిదంబరం, సికింద్రాబాద్

మార్గం చూపిన గురువులు

నా పేరు ఏరూషి శ్రీనివాస్. నేను జమ్మికుంట ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుకున్నాను. ఎందరో గురువులు, అందరికీ వందనాలు. అక్షరాలు నేర్పుతూ, మనలో ఆశయాలను, మానవతను పెంపొందిచే గురువులు ప్రత్యేకంగా అనిపిస్తారు. వారు మన హృదయాల్లో నిలిచిపోతారు. అలాంటి వారిలో బిల్ల సుబ్బారావు, మాదాడి విష్ణువర్థన్ రెడ్డిగార్లకు ప్రత్యేకించి నా ధన్యవాదాలు. నేను జమ్మికుంట హైస్కూల్లో చదువుతున్నప్పుడు నాలో వ్యక్తిత్వాన్ని నింపి మంచి దారిలో నడవడానికి ఒక మార్గాన్ని ఎంచుకోవడానికి వారు కారకులయ్యారు. డిగ్రీలో ఉండగా మధుసూదన్‌రావుగారు మాకు తెలుగు భాష పట్ల మమకారాన్ని, సమాజం పట్ల అవగాహనను పెంచారు. ఎలా జీవించాలో నేర్పి, ఈనాడు సమాజంలో ఉన్నతంగా బతకడానికి ప్రేరణను కలిగించారు. ఈ రోజు నేనిలా రాస్తున్నానంటే అది మా గురువుల స్ఫూర్తే. నా జీవితాన్ని తీర్చిదిద్దుకుని అభివృద్ధికి సాధిస్తూ, మరికొంతమంది జీవితాలకు బాటలు వేయగలిగే ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించిన గురువులందిరకీ సదా నేను రుణపడి ఉంటాను. ఇలా విద్య, సామాజికపరంగా నా వెన్నుతట్టి ప్రోత్సహించి, నా అభివృద్ధికి కారకులైన గురువులు ముగ్గురినీ ఈ శీర్షిక ద్వారా మననం చేసుకునే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

– ఏరూషి శ్రీనివాస్, జమ్మికుంట, కరీంనగర్

అమ్మ అనే మాట ఒక కమ్మని పాట

అమ్మ అనే పదం చాలు... అందులోనే ఎంతో ప్రేమ, ఆప్యాయత, కొండంత బలం, ఊరట, ఆశ, శ్వాస.. .అన్నీ ఉంటాయి. ఎంత గొప్ప వ్యక్తి అయినా అమ్మ కడుపులోనుండి రావాల్సిందే అనడానికి 'బ్రహ్మకూడా ఓ అమ్మకు కొడుకే' అంటారు ఓ గీత రచయిత. ప్రతి వ్యక్తి జీవితంలోనూ ఎంతో ఉన్నత స్థానమున్న అమ్మకు సినిమాల్లోనూ అంతే ప్రాముఖ్యతను ఇచ్చారు మన గీత రచయితలు. అమృతం లాంటి అమ్మ ప్రేమకు మచ్చుతునకగా కొన్ని సినీగీతాలు....

కని పెంచిన అక్షరాలు నేర్పిన అమ్మకి గురువుగా మారడం, నడక నేర్పిన నాన్నకి మార్గం చూపడమనేది సహజంగా జరగదు. ఇది ఊహ మాత్రమే. కానీ 'మనం' సినిమాలో ఆ ఊహకు ప్రాణం పోస్తే ఎలా ఉంటుందో చూపించారు "కని పెంచిన మా అమ్మకే అమ్మయ్యానుగా, నడిపించిన మా నాన్నకే నాన్నయ్యానుగా" పాటతో. మనసును తడిమి, తట్టి లేపినట్టనిపిట్టనిపించే ఈ పాటను చంద్రబోస్ రాశారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ పాట మాస్టర్ భరత్ పాడుతుంటే అలా వింటూ ఉండిపోవాల్సిందే.

అమ్మ అనే మాట కంటే తీయని మాట, పాట మరేమీ ఉండవు. అమ్మ అనే మనిషే లేకపోతే సృష్టే ఉండదు. మరి అంత గొప్పతనమున్న అమ్మని నిర్లక్ష్యం చేసినా తట్టుకోగలదు. అయితే ఆ అమ్మ పనిచేయనని మొరాయిస్తే, తన అమ్మ తనానికి రాజీనామా చేస్తే... ఇది ఊహించుకోడానికి కూడా మనసొప్పదు. శారద, సత్యనారాయణ ప్రధాన పాత్రలతో వచ్చిన 'అమ్మ రాజీనామా' చిత్రంలో చిత్ర పాడిన "ఎవరు రాయగలరు అమ్మ అను మాట కన్న కమ్మని కావ్యం, ఎవరు పాడగలరు అమ్మ అనురాగం కన్న తీయని రాగం" పాటను సిరివెన్నెల సీతారామశాస్త్రి రాయగా, చక్రవర్తి స్వరకల్పన చేశారు. ఇందులోదే మరో పాట "సృష్టికర్త ఒక బొమ్మ, అతనిని సృష్టించినదొక అమ్మ" పాట. పెంచి పెద్దచేసిన తల్లిని అడ్డు అనుకుని పక్కన పెడితే రేపు తమ పిల్లలూ ఇదే పని చేస్తే!? ఇదేం న్యాయమని నిలదీయగలరా? ఈ పాటను కె.జె.ఏసుదాసు పాడితేనే వినాలనేంత మధురంగా ఆలపించారు.

కంటికి రెప్పలా కాపాడే అమ్మ బిడ్డలకు వెలుగునిస్తుంది. తన ప్రేమానురాగాల్ని కలిపి ముద్దగా బిడ్డలకు పెడుతుంది. ఈ తల్లి ప్రేమ మళ్లీ ఈ బిడ్డలు తల్లిదండ్రులయినప్పుడు తెలుస్తుంది. మహేష్ నటించిన 'నాని' చిత్రంలోని చంద్రబోస్ సాహిత్యం అందించిన "పెదవే పలికిన మాటల్లోని తియ్యని మాటే అమ్మ, కదిలే దేవత అమ్మ... కంటికి వెలుగమ్మా..." పాటకు సంగీతం ఎ.ఆర్.రెహమాన్ అందించారు. ఉన్ని కృష్ణన్, సాధన సర్గం ఆలాపనలో హాయిగా సాగుతుంది ఈ పాట.

జన్మనిచ్చిన తల్లీ, పుట్టి పెరిగిన నేల ఒకటే. అమ్మని ఎంత ప్రాణంగా చూసుకుంటామో, ఆమె ఒడి ఎంత హాయిగా ఉంటుందో పుట్టిన ఊరికి వెళ్లినా అంతే సంతోషంగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ పుట్టిన ఊరి మీద ప్రేమ ఉంటుంది. సాధ్యమైనా కాకపోయినా ఆ ఊరికి ఏదో ఒకటి చేయాలనిపిస్తుంది. 'రాజన్న' చిత్రంలో మాళవిక పాడిన "అమ్మా... అవనీ... నేలతల్లీ అని ఎన్ని సార్లు పిలిచినా తనివి తీరదెందుకనీ... కనిపెంచిన ఒడిలోనే కన్ను మూయనీ... మళ్లీ ఈ గుడిలోనే కళ్లు తెరవనీ'. కె.శివదత్త రాసిన ఈ పాటకు ఎం.ఎం. కీరవాణి స్వరకల్పన అద్భుతంగా ఉంటుంది.

కంటేనే అమ్మ కాదు, ప్రేమగా పెంచినవారూ తల్లితో సమానమే. కానీ ఆ అమ్మే పంతం, పట్టుదల, అ హంకారంతో కన్న కూతుర్నే వదిలి పెడితే... 'ప్రేమించు' చిత్రంలో బాలసుబ్రహ్మణ్యం, చిత్ర ఆలపించిన "కంటేనే అమ్మ అని అంటే ఎలా, కరుణించే ప్రతి దేవత అమ్మే కదా" పాటను సి. నారాయణరెడ్డి రాస్తే, దానికి ఎం.ఎం. శ్రీలేఖ తన సంగీతంతో ప్రాణం పోశారు.

అమ్మ లాలన, పాలన, ప్రేమ ఎంత పొందినా తనివితీరదు. పసిపిల్లలకు తల్లే లోకం. ఎన్నేళ్లొచ్చినా ఆ ప్రేమకు దాసోహం అనాల్సిందే. అదే తల్లిని కొడుకు లాలించి పాలిస్తే... చంటిపాపలా సాకితే... 'అభిషేకం' చిత్రంలో ఉన్ని కృష్ణన్ పాడిన "నాలో నిను చూసుకోగా, నాతో మురిపించుకోగా, ఒళ్లో పాపాయివైనావమ్మా" పాటను సిరివెన్నల రాశారు. ఎస్.వి.కృష్ణారెడ్డి స్వరాలు అందించారు.

తన చావు ముందే తెలిసిన తల్లికి పిల్లల భవిష్యత్తు గురించి, వారి ఆలనా పాలన గురించి భయపడడం సహజం. తండ్రి కూడా లేకపోతే ఆ దిగులు ఎంతగా ఉంటుందో చెప్పనవసరం లేదు. వారికి రక్షణగా ఎవరుంటారో, వారిని సురక్షితంగా కాపాడగల వారి దగ్గర చేర్చడానికి ఎన్ని కష్టాలైనా ఎదుర్కోడానికి వెనుకాడదు. రెండు దశాబ్దాల క్రితం వచ్చిన 'మాతృదేవోభవ' చిత్రంలోని "రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే, వేణువై వచ్చాను భువనానికి" పాటలు ఎప్పటికీ వినాలనిపించే పాటలే.

దేవుడు లేడనేవాళ్లు ఉంటారు కానీ అమ్మ లేదనేవాళ్లు వుండరు. అమ్మ ప్రేమ ఉంటే చాలు... అదే పెద్ద ఆస్తి. ఆమె ప్రేమతో ఎన్ని సిరిసంపదలైనా సంపాదించొచ్చు. 'బుల్లెమ్మ-బుల్లోడు' చిత్రంలో దాశరథి రాసిన "అమ్మ అన్నది ఒక కమ్మని మాటా.. అది ఎన్నెన్నో తెలియని మమతల మూటా" పాటని సత్యం సంగీత దర్శకత్వంలో ఎస్.పి.బాలు, బెంగళూరు లత పాడారు.

అమ్మ లేని చంటి పాపకు అమ్మలా లాలించి పాలించడం అంత తేలిక కాదు. 'ఘటోత్కచుడు' చిత్రంలో ఎస్.పి. బాలు ఆలపించిన "అందాల అపరంజి బొమ్మ, అమ్మ లేదని బెంగ పడకమ్మా" అంటూ ఎంత బుజ్జగించినా ఆ పాపాయికి తల్లిలేని లోటు తీరుతుందా? ఆకలితో అలమటించినా దగ్గరికి తీసుకోలేని తల్లి నిరాసక్తత 'సింహరాశి' చిత్రంలో అమ్మా అని పిలిచి పిలిచీ గుండె పిండకురా' పాటలో కనిపిస్తుంది. ఇలా చెప్పుకోవాలంటే అమ్మ మీద వందల కొద్దీ పాటలు ఉన్నాయి. అమ్మ ప్రేమకి సాటి మరోటి లేదు.

- బి.మల్లేశ్వరి

■ **సృజన**

నవాబ్ నిజామత్ జంగ్ ఉర్దూ గజళ్ళను ఇంగ్లీషులోకి స్వేచ్ఛానువాదం చేశారు. The Ghazals of H.E.H. The Nizam పేరుతో ఈ ఇంగ్లీషు పుస్తకం అచ్చయ్యింది. ఈ పుస్తకానికి స్వయంగా. నిజామ్ మనవడు ప్రిన్స్ ముఫఖం జా ముందుమాట రాశారు. నిజామ్ వ్యక్తిత్వాన్ని, నిజామ్ కవితాభిలాషను అర్థం చేసుకోడానికి ఆ ముందుమాట ఎంతైనా తోడ్పడుతుంది. ప్రిన్స్ ముఫఖంజా రాసిన ముందుమాట ఆధారంగా నిజామ్ కవిత్వ పరిచయమిది

నిజాం గజళ్ళ పరిచయం

ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కవిత్వం

హైదరాబాద్ అండ్ బీరర్ సంస్థానాధీశుడు, ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అనేక రంగాల్లో ప్రవేశమున్న ప్రజ్ఞాశాలి. ఆయన రాసిన కవిత్వం అనేకమందిని ఆకట్టుకుంది. ముఖ్యంగా యవ్వనప్రాయంలో ఉర్దూ, ఫార్సీ భాషల్లో గజల్, నజ్మ్ ఇతర కవితా ప్రక్రియల్లో కవితలు రాశారు. ఈ కవితాప్రక్రియల ఛందోలక్షణాలపై ఆయనకు మంచి పట్టు ఉండేది.

స్వతహాగా నిజామ్ చాలా నిశితమైన తెలివితేటలు కలవ్యక్తి. అద్భుతమైన జ్ఞాపకశక్తి కలిగినవాడు. రాజకుమారుడిగా అత్యుత్తమస్థాయి విద్యాభ్యాసం ఆయనకు లభించింది. ఆయన మితభాషిలా కనబడేవాడు కాని, ఏ విషయం గురించైనా తడుముకోకుండా, ధారాళంగా మాట్లాడే వక్త. పాలకుడి హోదాలో ఉన్నప్పటికీ చాలా సాధారణంగా, చాలా సామాన్యంగా జీవితం గడిపేవాడు. చాలా సున్నితమైన మనస్సు కలవాడని ప్రిన్స్ ముఫఖం జా ముందుమాటలో రాశాడు.

విద్యార్థి దశలోనే నిజామ్ సాహిత్యాభిలాష కలిగిన వ్యక్తి. సాహిత్యం పట్ల మక్కువ వల్ల ఆయనకు భాషపై తిరుగులేని పట్టు ఉండేది. ఆయన ఏది రాసినా అత్యంత క్లుప్తంగా, సరళంగా, స్పష్టంగా, రాసేవాడు. నిజామ్ గద్యశైలి అనుకరించడం ఇతరులకు సాధ్యపడేది కాదు. భాషపై ఉన్న ఈ పట్టు ఆయన కవిత్వంలోను కనబడుతుంది.

కవిత్వంలో ఆయనకు గురువు జలీల్. ఉర్దూలో గురువులేని కవి ఎవరు ఉండరు. ప్రతి కవి తన కవిత్వాన్ని గురువుతో దిద్దించుకునేవాడు. గురువులేని కవిని బే ఉస్తాదీ అని తక్కువగా చూడడం జరిగేది. నిజామ్ గురువుగా వ్యవహరించిన జలీల్కు తర్వాత నవాబ్ ఫసాహత్ జంగ్ బిరుదుతో ఆయన సత్కరించాడు. భారతదేశానికి చెందిన గొప్ప కవుల్లో జలీల్ ఒకరు. మరో గొప్ప కవి అమీర్ మినాయీకి ఆయన శిష్యుడు. అమీర్ మీనాయి 1900లో హైదరాబాద్ వచ్చాడు. నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తండ్రి నిజామ్ మీర్ మహబూబ్ అలీ పాషా అప్పుడు అధికారంలో ఉన్నారు. మీర్ మహబూబ్ అలీ పాషాకు ఎందువల్లనో అమీర్ మినాయీ నచ్చలేదు. హైదరాబాద్ వచ్చిన తర్వాత అమీర్ మినాయీ జబ్బుపడి మరణించాడు. ఆయన్ను నిజామ్ ఉస్మాన్ అలీ కలిసి ఉండే అవకాశం లేదు కాని, అమీర్ మినాయీ కవిత్వంతో నిజామ్కు పరిచయం లేనే లేదనలేము. నిజామ్ కవిత్వాన్ని చాలా ఇష్టంగా చదివేవాడు. పుస్తకపఠనంలో చాలా కాలం గడిపేవాడు. అనేక మంది ప్రముఖ కవులు హైదరాబాద్ పట్ల ఆకర్షితులు కావడానికి ఆయనే ముఖ్యమైన కారణం. హలీ వంటి గొప్ప కవి కూడా హైదరాబాద్ పట్ల ఆకర్షితుడయ్యాడంటే నిజామ్ రాజుల కవిత్వ పోషణే కారణం.

ప్రముఖ ఉర్దూ కవి, మొగల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ కు గురువు దాగ్ తోను నిజామ్కు పరిచయం ఉంది. నిజామ్ తండ్రి మహబూబ్ అలీ పాషా కు దాగ్ కవిత్వ గురువు. దాగ్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ వలస వచ్చి చివరి 18 సంవత్సరాలు ఇక్కడే జీవించాడు. 1905లో ఆయన మరణించాడు. దాగ్కు ఫసీహుల్ ముల్క్ బిరుదుతో నిజామ్ తండ్రి సన్మానించాడు. గొప్ప కవులతో ఆయనకున్న పరిచయాలు ఆయన కవిత్వం మరింత పదునుతేలడానికి ఉపయోగపడ్డాయి.

అనేకమంది ప్రముఖ కవులతో పరిచయాలున్నప్పటికీ నిజామ్ తనదైన ప్రత్యేకశైలిలోనే రాసేవాడు. ఆయనపై ఎవరి ప్రభావాన్ని చూపించడం చాలా కష్టం. సాధారణంగా అప్పటి కవులు సాంప్రదాయికంగా వాడే ప్రతీకలను గాని, కవిత్వ అభివ్యక్తిని కాని ఆయన అనుసరించలేదు. ఆయన అభివ్యక్తిలో ఒక ప్రత్యేకత ఉండేది. కవిత్వ అభివ్యక్తి విషయంలో ఆయన రాజీపడలేదు. సాంప్రదాయిక భాషా పరిమితులను అవసరమైతే అధిగమించేవాడు.

కవిత్వంలో భావం చాలా ముఖ్యమైనది. ఒక వస్తువును ఎంచుకున్న తర్వాత, కవిత్వ అభివ్యక్తి ద్వారా ఆ వస్తువుపై కవి ఏ భావాన్ని చెప్పదలచుకున్నాడో అది చాలా ముఖ్యమైనది. కవిత్వ నిర్మాణం దానికి అనుగుణంగా ఉంటుంది. ఉర్దూ కవిత్వ సంప్రదాయంలో ప్రతి కవి ఒక గురువుకు శిష్యరికం చేసేవాడు. కవిత్వ నిర్మాణంలో మాత్రమే గురువు సహాయపడేవాడు. వస్తు ఎంపిక విషయంలో కాని, కవి హృదయంలోని భావం విషయంలో కాని గురువు కల్పించుకోవడం జరిగేది కాదు. నిజామ్కు మొదట గురువుగా జలీల్ ఉండేవాడు. జలీల్ ఆ కవితలను కాస్త మెరుగుదిద్దడానికి కొన్ని సూచనలివ్వడం తప్ప సాధారణంగా అంతకుమించి కవిత్వనిర్మాణం విషయంలో కూడా కల్పించుకునే అవసరముండేది కాదు. నిజామ్ రాసిన కవిత్వమంతా ఆయన స్వంత అభివ్యక్తి.

చాలా మంది రాజులు కవిత్వం రాశారు. ఉర్దూలో ఒక కవితాసంకలనాన్ని దివాన్ అంటారు. ఒక దివాన్ లేదా రెండు దివాన్లు

ప్రచురించిన వారున్నారు కాని నిజామ్ మాదిరిగా మూడు కవితా సంకలనాలు ప్రచురించిన రాజులు చాలా తక్కువ. నిజామ్ కవిత్వాన్ని అప్పటి దిగ్గజాలైన కవులతో పోల్చనూ లేము. కవులుగా స్థిరపడిన వారి కవిత్వ అభివ్యక్తికి నిజామ్ అభివ్యక్తికి చాలా తేడా ఉంది. ఆయన శైలి చాలా ప్రత్యేకమైనది. ఆయనపై ఎవరి ప్రభావమైనా ఉందంటే అది మొగల్ చక్రవర్తి బాబర్ ప్రభావం ఉందని చెప్పాలి. మొగల్ చక్రవర్తి బాబర్ కూడా మంచి కవి అన్నది తెలిసిందే. ఆయన కాలంలో కవిత్వం రాసిన కవుల్లో ఒక్క మొగల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ తప్ప మరెవ్వరు ఆయనకు పోటీ కాదని విశ్లేషకుల అభిప్రాయం.

ఉర్దూ గజల్ రచనలో కవి తన పేరును, లేదా తన కలంపేరును కవితలో వాడుకోవడం సంప్రదాయం. అసదుల్లా ఖాన్ తన కవితల్లో గాలిబ్ అన్నే కలంపేరు వాడుకున్నాడు. ముఖ్యంగా గజల్ ప్రక్రియలో రాసిన కవితల్లో ఇది స్పష్టంగా తెలుస్తుంది. బహదూర్ షా జఫర్ తన గజళ్ళలో జఫర్ అన్నే పేరు వాడుకునేవాడు. గాలిబ్ కూడా మొదట్లో తన గజళ్ళలో అసద్ అన్నే అసలు పేరునే వాడుకున్నాడు. మన కాళోజీ రామేశ్వరరావు గారు షాద్ అన్నే పేరుతో రాసేవారు. ఇలా ఉపయోగించే కలంపేరు లేదా నామముద్రను తఖల్లుస్ అంటారు. నిజామ్ తన పేరులో "ఉస్మాన్" అన్నే పదాన్ని తఖల్లుస్‌గా ఉపయోగించేవాడు. ఆయన రాసిన అనేక గజళ్ళలో సూఫీతత్వం చదువరిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. ముఖ్యంగా గజల్ ప్రక్రియలో ఉండవలసిన చమత్కారం చదువరి మనసులో ఒక మెరుపులా మెరుస్తుంది. ఆయన తన కవిత్వంలో తన సంతోషాన్ని, తన దుఃఖాన్ని, తన విషాదాలను, తన భావాలను, తాను నమ్మే జీవిత సిద్ధాంతాన్ని, తన అనుమానాలను, తన లోపాలను, తన ప్రేమలను, సూఫీతత్వాన్ని, తన వైఫల్యాలను అన్నింటినీ రాసుకున్నాడు.

నిజామ్ కవితలు రాయడం ప్రారంభించినప్పుడే వాటిని ఇంగ్లీషులోకి అనువదించాలని నవాబ్ సర్ నిజామత్ జంగ్‌ను కోరాడు. సర్ నిజామత్ జంగ్ గొప్పగా చదువుకున్న వ్యక్తి. ఇంగ్లీషు, ఉర్దూ, ఫార్సీ భాషలపై తిరుగులేని ఆధిపత్యం కలవాడు. స్వయంగా ఫార్సీ, ఇంగ్లీషు భాషల్లో మంచి కవి కూడాను. సర్ నిజామత్ జంగ్ పట్ల నిజామ్కు ప్రత్యేకమైన గౌరవాదరాలు ఉండేవి. నిజామ్ కన్నా ఆయన 15 సంవత్సరాలు చిన్నవాడు. హైదరాబాద్‌లో ప్రాథమిక విద్య తర్వాత బ్రిటన్‌లో ఉన్నత విద్య అభ్యసించాడు. కేంబ్రిడ్జి ట్రినిటీ కాలేజీలో చదువుకున్నాడు. మిడిల్ టెంపుల్ బార్‌లో సభ్యుడు. హైదరాబాద్ తిరిగి వచ్చిన తర్వాత ఆయన సివిల్ సర్వీసులో చేరాడు. న్యాయ, పరిపాలన విభాగాల్లో ప్రతిభావంతంగా సేవలందించాడు. హైకోర్టు జడ్జిగాను తర్వాత చీఫ్ జస్టిస్ గాను పనిచేశాడు. హోం సెక్రటరీగాను, రాజకీయ విభాగానికి కార్యదర్శిగాను, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో మంత్రిగాను ఆయన పనిచేశాడు.

నవాబ్ సర్ నిజామత్ జంగ్ గొప్ప మేధావి. మంచి కవి. 1918లో ఆయన ఇంగ్లీషు కవిత్వం ఇంగ్లాండ్లో ప్రచురించబడింది. ఆయన రాసిని సోనెట్లను టైమ్స్ లిటరరీ సప్లిమెంట్ ప్రశంసలతో ముంచెత్తింది. ఇంగ్లీషు సాహిత్యంలో తనదైన స్థానం సంపాదించుకున్న కవి ఆయన. నిజానికి సర్ నిజామత్ జంగ్ రచనావ్యాసంగంలో నిజామ్ గజళ్ళ అనువాదం అనేది చాలా చిన్న అధ్యాయం. అది కూడా నిజామ్ కోరికపై ఆయన అనువాదానికి పూనుకున్నాడు.

నిజామత్ జంగ్ మాటల్లో చెప్పాలంటే : తన గజళ్ళను కొన్నింటిని ఇంగ్లీషులోకి అనువదించాలని నిజామ్ నన్ను కోరి, తన కవితల మూడు సంపుటాలను నాకు కానుకగా పంపారు... వాటిని చదివిన తర్వాత.. నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఒక గొప్ప పాలకుడే కాదు, భావుకుడు, మేధావి కూడా అని అర్థం చేసుకున్నాను. ఆయన కవిత్వం ఇతర భాషల ప్రజలకు కూడా అందాలని భావించాను.

ఇంగ్లీషులోకి అనువదించమని నన్ను కోరడం నాకు చాలా సంతోషమైంది. కాని ప్రాచ్య కవితా అభివ్యక్తిని, ప్రతీకలను, కవిత్వనిర్మాణాన్ని పాశ్చాత్య ఇంగ్లీషు అభివ్యక్తిగా మార్చడం చాలా కష్టం. అందువల్ల నేను ఇంగ్లీషు కవితారీతులను అనుసరిస్తూ, కాస్త లిరికల్ టోన్ సాధిస్తూ, ఆయన గజళ్ళలోని భావాన్ని ఇంగ్లీషులోకి స్వేచ్ఛానువాదం చేశాను. ఈ అనువాదాన్ని అందరూ మెచ్చుకోవడం నాకు చాలా ఆనందమయ్యింది.





ఈ అనువాదం చూసి నిజామ్ చాలా సంతోషించాడు. అందంగా ముద్రించిన బౌండు కాపీలను తన సన్నిహిత మిత్రులకు పంపించాడు.

నిజామ్ 1921లో లార్డ్ హార్డింగ్‌కు ఒక లేఖరాశాడు. నవాబ్ నిజామత్ జంగ్ అనువదించిన తన కవితలను కొన్నింటిని హార్డింగ్కు పంపించాడు. తన కవితల గురించి ఆయనకు రాస్తూ "... ఇవన్నీ ఉర్దూలో ఉన్నాయి. అది మీ భాష కాదు. ఉర్దూ మాతృభాషగా ఉన్నవారు మాత్రమే ఉర్దూ కవిత్వంలోని మాధుర్యాన్ని, సౌందర్యాన్ని అర్థం చేసుకోగలరు. మీకు అది సాధ్యం కాదు. అందువల్ల నేను రాసిన కొన్ని గజళ్ళ ఇంగ్లీషు అనువాదాన్ని మీకు పంపిస్తున్నాను. ఉర్దూలో ఉన్న భావాన్ని, అర్థచ్ఛాయలను, అందాన్ని సాధ్యమైనంత వరకు ఇంగ్లీషులో కూడా కనిపించేలా చేసిన అనువాదం ఇది..." అని చెప్పాడు.

ఇంగ్లీషు అనువాదంలో కూడా నిజామత్ జంగ్ ఇంగ్లీషు భాషకు తగిన కవిత్వ నిర్మాణంతో చేసిన అనువాదం ఉర్దూ కవిత్వానికి మాత్రమే ప్రత్యేకమైన అద్భుతమైన ప్రతీకలను, పదచిత్రాలను మనకు అందిస్తుంది.

ఉదాహరణకు :

ఆమె నిట్టూర్పుల మంటలనుంచి కొన్ని అగ్గిరవ్వలు పైకి లేచాయా, వాటి వల్ల స్వర్గం గుండెలో నిప్పు పెట్టినట్లుంది. ఆకాశం మండుతున్నట్లు ఎర్రబడింది.

నా హృదయగాథ చెప్పాలని అనుకున్నాను
పదాలు పెదాలపైనే ప్రాణం విడిచాయి.
కనురెప్పలు విడిచే బాణాల దెబ్బతినని వాడికి
గుండెలో ప్రేమకదలికల తీయదనం తెలియదు
దట్టమైన మబ్బులను చీల్చుకుని ప్రకాశించే సూర్యకిరణాల్లా
విషాదాల గుట్టలను చీల్చుతూ నా గుండెగాయం ప్రకాశిస్తుంది.

ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వ్యక్తిత్వంలోని సరికొత్త కోణాన్ని పరిచయం చేసే అద్భుతమైన గజళ్ళు ఈ పుస్తకంలో ఉన్నాయి. నవాబ్ నిజామత్ జంగ్ ఇంగ్లీషు అనువాదానికి బదులు, ఒరిజినల్ గా రాసిన ఉర్దూ నుంచి ఆ గజళ్ళను తెలుగులోకి అనువదిస్తే ప్రపంచ సాహిత్యంలో నిజామ్ రాసుకున్న పుటలను మనం కూడా చదువుకోవచ్చు.

– వాహెద్, 7396103556

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

“సే థాంక్స్”

సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్ ఫేస్‌బుక్ గురించి తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఫేస్‌బుక్‌కు పెద్దాచిన్నా తేడాలేకుండా అందరూ అతిథులే. రోజులో కనీసం ఒక్కసారైనా ఫేస్‌బుక్‌ను ఓపెన్ చేయలేదంటే ఏదో కోల్పోయామన్న భావన. మానవ జీవితంతో అంతగా పెనవేసుకుపోయింది మరి. ఇదే ఫేస్‌బుక్‌ను ఉన్నత స్థానంలో కూర్చోబెట్టింది ఇదే. తన వినియోగదార్లకు ఎప్పటికప్పుడు కొత్తకొత్త ఫీచర్లను అందించడంలో ఫేస్‌బుక్ ముందువరుసలో వుంటుంది. అదే తరహాలో ఇప్పుడు ఫేస్‌బుక్ ఆవిష్కరించిన సరికొత్త ఆప్షన్ “సే థ్యాంక్స్”. దీంతోపాటు చాటింగ్ కోసం మెసెంజర్ యాప్ కూడా అందుబాటులో వుంది. ఇప్పుడు ఆఫీస్ వెర్షన్‌ను ప్రారంభించే ప్రయత్నంలో నిమగ్నమైవుంది.



జీవితంలోని మధురమైన అనుభవాల్ని, అనుభూతుల్ని, సంఘటనల్ని ఫొటోలు, వీడియోల ద్వారా ఫేస్‌బుక్‌లో పంచుకోవడం సర్వసాధారణం అయిపోయింది. ఇప్పుడు సరికొత్త సందేశాలు, థీమ్‌తో రూపొందించిన వీడియోలను పంచుకోవడానికి ఒక “వీడియో క్రియేషన్” టూల్‌ను ఫేస్‌బుక్ అందుబాటులోకి తెచ్చింది. తాము పోస్ట్ చేసిన సందేశాల్ని, ఫొటోలను, కొత్త థీమ్స్‌ను కలిపి వ్యక్తిగతంగా ఓ వీడియో రూపొందించుకోవడానికి “సే థ్యాంక్స్” అనే ఈ కొత్త ఆప్షన్ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఫేస్‌బుక్‌కు 100 కోట్లకు పైగా వినియోగదారులున్నారు. ఒక్క భారత్‌లోనే 100 మిలియన్ల రోజువారీగా ఎన్నో విషయాలను పంచుకుంటున్నారు. వ్యక్తిగత వీడియోలను స్నేహితులు, బంధువులు, సహఉద్యోగులతో పంచుకోవచ్చు. మన ఖాతాలోని ఫ్రెండ్ ప్రొఫైల్ ఎంచుకుంటే చాలు, ఫేస్‌బుక్ ఆ వ్యక్తితో పంచుకున్న మధురక్షణాలు, ఫొటోలు, చక్కని సందేశాలతో అందమైన వీడియోలను మన ముందుంచుతుంది. దీన్ని మనం ఎడిట్ చేసుకోవచ్చు. వీడియో రూపొందించిన తర్వాత వ్యక్తిగత సందేశాన్ని కూడా పంపించుకునే అవకాశం ఈ ఆప్షన్‌లో కల్పించింది. ఎవరికి నచ్చిన విధంగా వారు రూపొందించుకోవడం ఈ టూల్‌లో వున్న ప్రత్యేకత. ఈ టూల్ ద్వారా వీడియోలు తయారు చేసుకోవడానికి ఎటువంటి పరిమితీ లేదు. మనకు నచ్చినన్ని కార్డులను రూపొందించుకోవచ్చు. షేర్ చేసుకోవచ్చు. ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్నవారందరికీ పంపుకోవచ్చు.

ఇది ఎలా పనిచేస్తుందంటే...

‘సే థ్యాంక్స్’ వీడియో క్రియేట్ చేయడానికి www.facebook.com/thanks పేజీలోకి వెళ్లాలి. ఎవరో ఒక ఫ్రెండ్‌ని దాని పొందే వ్యక్తిగా సెలెక్ట్ చేసుకోవాలి. ఫేస్‌బుక్ ఆ వీడియో ప్రివ్యూని మీకు చూపిస్తుంది. ఆ థీమ్ మీకు నచ్చకపోతే వేరే థీమ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అందులో ఉన్న మీ ఫొటోలు, మీ మిత్రుల ఫొటోలను కూడా మార్చుకోవచ్చు, ఎడిట్ చేసుకోవచ్చు. ఆ తర్వాత దాన్ని పోస్ట్ చేయొచ్చు. షేర్ ఆప్షన్‌పై క్లిక్ చేయగానే మీ పర్సనల్ మెసేజ్ ఇచ్చేందుకు ఒక అవకాశాన్ని ఇస్తుంది. ఆ స్థలంలో మీ సందేశాన్ని పెట్టుకోవచ్చు. ఆ తర్వాత ఆ పోస్ట్ మీ టైమ్‌లైన్ మీద కనిపిస్తుంది. అందులో మీ ఫ్రెండ్ ఆటోమేటిక్‌గా ట్యాగ్ చేయబడి ఉంటాడు. అంటే అతని టైమ్ లైన్ మీద కూడా ఆ వీడియో పోస్ట్ అయి కనిపిస్తుంది. ఇప్పుడీ ఫీచర్‌ను వాడుకుంటున్న వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లలోనే కాదు, మొబైల్‌లో కూడా దీన్ని వాడుకోవచ్చు. ఇంగ్లీష్, ఫ్రెంచ్, జర్మన్, ఇండోనేషియా, ఇటాలియన్, పోర్చుగీస్, స్పానిష్, టర్కిష్ భాషల్లో దీన్ని రూపొందించుకోవచ్చు.

ప్రస్తుతం ఫేస్‌బుక్‌లోని వీడియోలను రోజుకు ఒక బిలియన్(100కోట్లు)కు పైగా చూస్తున్నారని తాజా సమాచారం. ఇందులో 65 శాతం వీడియోలను మొబైల్ ఫోన్ నుంచే వీక్షిస్తున్నట్లు ఫేస్‌బుక్ పేర్కొంది. అయితే నెలకు 1.32 బిలియన్ ప్రజలు ఫేస్‌బుక్‌తో అనుసంధానం అవుతున్నారని, ఈ తరహాలో ఫేస్‌బుక్‌లో జాయిన్ అవుతున్న వారిలో మొబైల్ ఫోన్ల వినియోగదార్లే ఎక్కువగా ఉన్నారని తెలిపింది. గత జూన్‌లో ఒక బిలియన్‌కు పైగా ఫేస్‌బుక్ వీడియోలను వీక్షించారని.. ఇది మే నెల కంటే 50 శాతం అధికంగా ఉందని ఫేస్‌బుక్ పేర్కొంటోంది. తాజాగా విడుదలైన “సే థ్యాంక్స్” ఆప్షన్‌తో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం వుంది.

దీనికితోడు ఫేస్‌బుక్ మెసెంజర్ యాప్‌ను ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 50కోట్ల మంది వాడుతున్నారు. గత ఏప్రిల్లో ఈ యాప్‌ను వాడినవాళ్ల సంఖ్య 20కోట్లు మాత్రమే. ఫేస్‌బుక్ మెసెంజర్ యాప్ మీద మొదట్లో చాలామంది పెద్దగా ఇష్టం చూపించలేదు. కానీ క్రమంగా జనం దానికి బాగానే అలవాటు పడుతున్నారు. సాధారణ ఫేస్‌బుక్ కాకుండా, తాము విడుదల చేసిన మొదటి యాప్ ఇదేనని, ప్రధానంగా చాటింగ్‌ను సులభతరం చేయడానికి దీన్ని రూపొందించామని ఫేస్‌బుక్ తన బ్లాగు పోస్టులో తెలిపింది. దాని వేగాన్ని, విశ్వసనీయతను మరింత పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రతి రెండు వారాలకు మరింత మెరుగు పరుస్తున్నామని ఆ బ్లాగ్‌లో చెప్పారు. ఈ యాప్‌ను విడుదల చేస్తున్నట్లు జుకెర్‌బెర్గ్ ఈ ఏడాది ఆరంభంలో ప్రకటించారు. అప్పటినుంచి క్రమంగా దీనికి ఆదరణ పెరుగుతూ వస్తోంది.

ఆఫీసు వెర్షన్...

లింక్డ్ ఇన్ లాంటి సైట్లతో పోటీ పడేందుకు ఆఫీస్ వెర్షన్ ఒకటి ప్రారంభించాలని ఫేస్‌బుక్ ముమ్మరంగా పయత్నాలు మొదలెట్టింది. “ఫేస్‌బుక్ ఎట్ వర్క్” అనే సైట్ ద్వారా సహోద్యోగులతో చాట్ చేయడానికి, ప్రొఫెషనల్ కాంటాక్టులు పెంచుకోడానికి, డాక్యుమెంట్లు పంచుకోడానికి దీనివల్ల వీలవుతుంది. దీనిపై చాలా రహస్యంగా పని జరుగుతోందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఫేస్‌బుక్‌కు గత సంవత్సరం కంటే దాదాపు రెట్టింపు లాభాలొచ్చాయి. ఈ ఫలితాలను ప్రకటించే సందర్భంలోనే ఈ కొత్త సైట్ విషయాన్ని ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకెర్‌బెర్గ్ చూచాయగా చెప్పారు. పెట్టుబడుల విషయంలో తాము మరింత దూకుడుగా వ్యవహరిస్తామని, కంప్యూటింగ్ ప్లాట్‌ఫారాలలో తర్వాతి తరాన్ని రూపొందిస్తామని అన్నారు. ఇంకా చాలా దూరం పయనించాల్సి ఉందని చెప్పారు.

సోషల్‌మీడియా విస్తృతి రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఇతర సైట్ల నుండి పోటీని తట్టుకునేందుకు, తన వినియోగదార్ల సంఖ్యను రెట్టింపు చేసుకునే వ్యూహంలో భాగంగానే ఫేస్‌బుక్ కొత్తకొత్త ఆప్షన్స్‌ను పరిచయం చేస్తోంది. ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్ ప్రాథమిక అవసరంగా మారాలంటే సరికొత్త తరహాలో ముందుకెళ్లాలని భావించిన ఫేస్‌బుక్, గాల్లో విహరిస్తూ ఇంటర్నెట్‌ను అందించే డ్రోన్స్‌ను రూపొందించే పనిలో వుంది. ఇలా ఒక్కటొక్కటిగా ఇంకెన్ని అద్భుతాలను ఆవిష్కరించనుందో వేచిచూడాల్సిందే.

రచయిత సెల్ : 9490099219

హెర్పిస్‌కు హోమియోతో చెక్

డా॥మధు వారణాశి ఎం.డి
ప్రముఖ హోమియో వైద్య నిపుణులు
ప్లాట్ నెం.188,
వివేకానంద నగర్ కాలనీ
కూకట్‌పల్లి, హైద్రాబాద్.
ఫోన్ : 8897331110,
8886509509



జ్వరం, కీళ్లనొప్పులు, ఒళ్లంతా నొప్పులు, జననావయవాలలో మంట, దురద, మూత్రంలో మంట... ఇవన్నీ హెర్పిస్ వ్యాధిలో కనిపించే లక్షణాలు. మరి ఈ సమస్యకు పరిష్కారం లేదా? అంటే ఎన్నో సమస్యలకు కారణమవుతోన్న హెర్పిస్‌కు ఆధునిక హోమియో చికిత్సతో సరియైన పరిష్కారం లభిస్తుందని అంటున్నారు డా॥మధు వారణాశి.

ఒక గుండుసూది మీద కోటి వైరస్‌ల దాకా ఇమిడిపోయేంత సూక్ష్మమైన వైరస్ ఇది. జీవితాంతం బాధించే ఈ వైరస్‌ను హెర్పిస్ సింప్లెక్స్ వైరస్ అని అంటారు.

రెండు రకాలు

హెచ్ఎస్‌వి 1 : ఇది నోటి దగ్గర పొక్కుల రూపంలో బయటపడుతుంది. పెదవుల చుట్టూ తెల్లని నీటిపొక్కులలాగా కనిపిస్తుంది. ఇది ముఖ్యంగా తల్లిదండ్రులు, తోటి పిల్లల నుండి వ్యాపిస్తుంది. ఎక్కువగా పిల్లల్లో కనిపిస్తుంది. సాధారణంగా ఇవి వచ్చిపోతూ ఉంటాయి.

హెచ్ఎస్‌వి 2 : జననావయవాల దగ్గర పొక్కులతో బయటపడుతుంది. దీన్ని జెనిటల్ హెర్పిస్ అని అంటారు. చిన్న చిన్న పొక్కులలాగా వచ్చి పగిలిపోతుంటాయి. లైంగిక వ్యాధులలో నిత్యం వేధించే సమస్య ఇది.

ఎలా గుర్తుపట్టాలి

తొలి దశలో జననాంగాల్లో మంట, నొప్పి, మూత్రంలో దురద, జ్వరం వచ్చినట్లుగా ఉండడం జరుగుతుంది. ఒళ్లంతా నొప్పులు, గజ్జల్లో, చంకల్లో గడ్డలు కట్టినట్టుగా ఉంటుంది. తరువాత క్రమక్రమంగా లైంగిక భాగాలపై చిన్నచిన్న నీటి పొక్కులు కనిపిస్తాయి. రెండు, మూడు రోజులలో పగిలి పుండ్లలా తయారవుతాయి. ఈ దశలో రోగికి సమస్య వచ్చినట్లు తెలుస్తుంది. తొలిసారి లక్షణాలు కనిపించినప్పుడు సరైన చికిత్స తీసుకుంటే ప్రారంభదశలోనే సత్వరనివారణ జరుగుతుంది. కానీ చాలా మందిలో వైరస్ ఉండిపోవడం వల్ల నిదానంగా ఉంటూ తిరిగి బయటపడుతూ ఉంటుంది. దీన్ని హెర్పిస్ రికరెంట్ అటాక్ అని అంటారు.

హెర్పిస్ రికరెంట్ అటాక్స్

వాతావరణ పరిస్థితుల్లో ఉన్న తీవ్రమైన తేడాలు, మానసిక ఆందోళన వల్ల హెర్పిస్ రికరెంట్ అటాక్స్ వస్తాయి. దీనిలో లక్షణాల తీవ్రత అంతగా లేకపోయినా కొన్ని రోజులలో పుండ్లు మానిపోయి సాధారణంగానే ఉంటుంది. నీటి పొక్కులు చితికి పుండ్లుగా మారినప్పుడు హెర్పిస్ వైరస్ పుండు రసిలో ఉంటుంది. ఈ సమయంలో రతిలో పాల్గొంటే భాగస్వామికి అంటుకునే అవకాశం ఉంది. ఎలాంటి పుండ్లు, గాయాలు లేకపోయినా అవతలి వ్యక్తికి వ్యాపించే అవకాశం ఉంది. స్త్రీలలో నెలసరి సమయంలో చిన్నచిన్న పొక్కులు ఉన్నా తెలియవు. వీరికి హెర్పిస్ ఉన్నట్లు తెలియకపోయినా, లోలోపల హెర్పిస్ ఉండే అవకాశం ఉంటుంది.

నిర్ధారణ ఎలా?

ఈ వ్యాధిలో వైరస్ నిర్ధారణ చాలా ముఖ్యం. సాధారణంగా వ్యాధిని లక్షణాలను బట్టి గుర్తించవచ్చు. అపరిచిత వ్యక్తులతో లైంగిక సంపర్కం తరువాత వారం రోజులలో నీటి పొక్కులలాగా వచ్చి పుండ్లు కనిపిస్తాయి. కొన్ని రోజుల తర్వాత పుండ్లు మాని తిరిగి కనిపిస్తాయి. దీన్ని బట్టి హెర్పిస్‌ని గుర్తించవచ్చు. పీసీఆర్ టెస్ట్, హెచ్ఎస్‌వి 1,2, ఐజీజీ, ఐజీఎమ్ పరీక్షలు ఉపయోగపడతాయి. పుండ్ల దగ్గర ఉండే స్రావాలను సేకరించి కల్చర్ టెస్ట్, డీఎన్ఎ టెస్ట్, యూరిన్ టెస్ట్ మొదలగు పరీక్షలు నిర్ధారణలో ఉపకరిస్తాయి.

దుష్ఫలితాలు

హెర్పిస్ ఎక్కువగా స్త్రీలను బాధిస్తుంది. గర్భిణిల్లో మొదటి నెలలో హెర్పిస్ వస్తే గర్భస్రావం అయ్యే అవకాశాలు ఎక్కువ. ప్రసవ సమయంలో గర్భిణికి హెర్పిస్ ఉంటే పిల్లలకు వచ్చే ప్రమాదం ఉంది. దీనిని నియోనాటల్ హెర్పిస్ అంటారు. శరీరంలో హెర్పిస్ ఉంటే చర్మం మీద దద్దుర్లు, అలర్జీలాంటి సమస్యలు రావచ్చు. వెన్నెముకలోని నాడీమండలానికి హెర్పిస్ వస్తే అంగస్తంభన సమస్యలు మొదలుకావచ్చు. ఎక్కువ కాలం యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ వాడే వారిలో, డయాబెటిస్, హెచ్ఐవి ఉన్నవారు ఎక్కువగా హెర్పిస్ బారిన పడుతుంటారు. కొందరిలో నాడీమండలానికి హెర్పిస్ వచ్చి మెదడులో మెనింజైటిస్‌కు కారణమవుతుంది.

హోమియో చికిత్స

లైంగిక వ్యాధులలో హోమియో చికిత్స కీలక పాత్ర పోషిస్తుంది. శాస్త్రీయతను సంతరించుకున్న హోమియో చికిత్స మూలకారణాన్ని గుర్తించి దాన్ని తొలగించడంలో కృషి చేస్తుంది. దీనివల్ల అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చు. రోగనిరోధక వ్యవస్థను పెంచి రోగనివారణకు సరియైన మార్గాన్ని చూపిస్తుంది. హెర్పిస్ వచ్చిందని అనుమానం కలిగిన వెంటనే శృంగారానికి దూరంగా ఉండాలి. పొక్కులు కనిపించగానే చికిత్స తీసుకోవాలి. కండోమ్ ఉపయోగిస్తే మరీ మంచిది. అనుభవజ్ఞులైన హోమియో వైద్యుని దగ్గర చికిత్స తీసుకుంటే హెర్పిస్ ఇట్టే తొలగిపోతుంది.

*

అందుకున్నాం ■ **సమీక్షలు**



మశాల్
తెలంగాణ
మహోద్యమ కావ్యం
వనపట్ల సుబ్బయ్య
వెల :100/-
పేజీలు : 191
అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు



కాశీబుగ్గ
ఈతకోట సుబ్బారావు
వెల: 80/-
పేజీలు : 122
ప్రతులకు :
9440529785



నవ్విన ధాన్యరాశి
కథల సంపుటి
సి.వేణు
వెల : 116/-
పేజీలు : 155
ప్రతులకు :
09900896123

సాహితీకిరణం
సంపాదకీయాలు
పొత్తూరి సుబ్బారావు
వెల : 120/-
పేజీలు : 175
ప్రతులకు :
ప్రజాశక్తి,
విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

అగ్నిశిఖ
ప్రరవే స్పందన
వెల : 80/-
పేజీలు : 132
ప్రతులకు : అన్ని
పుస్తకకేంద్రాలు,
9440254730

ఉత్తర తెలంగాణను ఉద్ధరించేదెప్పుడు?



ఉత్తర తెలంగాణ అభివృద్ధి కొన్ని సూచనలు, కొలిపాక నాందేవ్,
వెల : 50/-, పేజీలు : 112, ప్రతులకు : ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

ఒక రాష్ట్రం లేదా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతుల కల్పన కీలకమవుతుంది. సహజ వనరుల సద్వినియోగం, మానవ వనరులను పెంపొందించుకోవడంపై దృష్టిని కేంద్రీకరించాలి. ఇన్నేళ్లలో ఈ అంశాలు ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. వెనుకబడ్డ ప్రాంతాల ప్రాధ్యన్యతగా పనులు చేపట్టడంలో గత పాలకులు విఫలమయ్యారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల అభివృద్ధికి పుష్కలమైన వనరులున్నాయి. అడవులు, ఖనిజ సంపదకు కొదవలేదు. సాగునీరు కల్పించేందుకు అవకాశాలు మెండుగానే ఉన్నాయి. వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియని పరిస్థితి.

అభివృద్ధి, వెనుకబాటు విషయంలో ఉత్తర తెలంగాణ మూడు జిల్లాల్లోనూ ఒక్కో జిల్లాది ఒక్కో ప్రత్యేక పరిస్థితి. రాష్ట్రంలోనే ఓ మూలకు విసిరేయబడుతోన్న ఆదిలాబాద్ అన్నింటా వివక్షతకు గురవుతుంది. మలేరియా చావులు, రైతు ఆత్మహత్యలు, పౌష్టికాహార లోపంతో మరణాలు, మాతా శిశు మరణాల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. అపారమైన అటవీ సంపద ఉన్నా అటవీ ఆధారిత పరిశ్రమలు లేవు. సరైన బ్యాకింగ్ సదుపాయం లేదు. రాష్ట్రంలో ఎక్కడా లేని దళారీ వ్యవస్థ ఇక్కడ వేళ్లూనుకుంది. ఏజెన్సీ సహా జిల్లా వ్యాప్తంగానూ రవాణా వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. ఉన్నంతలో కొంత మేరకు అభివృద్ధి ఛాయలు కనిపిస్తున్న కరీంనగర్, నిజామాబాద్‌లది మరో ప్రత్యేకత పరిస్థితి. ఈ జిల్లాల్లో కార్పొరేట్ హంగుల్లోనే అభివృద్ధి పనిపిస్తోంది. కార్పొరేటీకరణ దుష్ఫలితంగా విద్య, వైద్యం పేదలకు ఎండమావిగానే మిగిలిపోయింది. ప్రపంచీకరణ పుణ్యమా అని అసంఘటిత, బీడీ కార్మికుల బతుకులు మరింత దుర్భరమతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఖండాంతర వలసలు కొనసాగడానికి ప్రధాన కారణం ఉన్నచోట ఉపాధి లేకపోవడమే. యువత అటు గల్ఫ్ దేశాలకు, పక్కనున్న రాష్ట్రాలకు వలసపోతున్నారు. ఈ పరిస్థితిని ఆపేందుకు ఉన్నచోటనే ఉపాధి కల్పించేందుకు బోలెడు అవకాశాలున్నాయి. ఖాయిలా పడ్డ పరిశ్రమల పునరుద్ధరణ, కొత్త పరిశ్రమల ఏర్పాటుతోనే అది సాధ్యం. పెట్టుబడులను ఆకర్షించాలంటే సరైన రవాణా వ్యవస్థను, కొత్తగా రైల్వే, విమాన సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. శాశ్వత ప్రాతిపదికన వనరులు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ఈ అంశాలతో పాటు విద్య, వైద్యం తదితర అంశాలను కూడా ఈ పుస్తకంలో చర్చించారు. ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ప్రత్యక్షంగా చూసి, తన అనుభవాలను, సూచనలను ఈ పుస్తకం ద్వారా మన ముందుకు తెచ్చిన రచయిత కృషి అభినందనీయం.

– కె.పి

గమనిక

➠ సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.

➠ రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.

➠ పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–500030.

కథని సత్కరించిన ఉత్తరాంధ్ర



ఉత్తరాంధ్ర కథలు
పేజీలు: 1028,
వెల: రూ. 600
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

తెలుగులో ఆధునిక కథ వికాస ఆవిర్భావాలకు మూలాలు ఉత్తరాంధ్రలో వున్నాయి. దాని కొనసాగింపు ఉత్తరాంధ్రలో ఇప్పటికీ కనిపించడం విశేషం. ఈ మధ్యన 'విశాలాంధ్ర' వారు వెలువరించిన 'ఉత్తరాంధ్ర కథలు' అనే భారీ పుస్తకాన్ని చూస్తే ఉత్తరాంధ్ర కథ విస్తరించిన తీరుతెన్నులు తెలుస్తాయి. ఈ పుస్తకానికి విరియాల లక్ష్మీపతి, డా. చాగంటి తులసి సంపాదకులుగా, డా. ఎస్వీ సత్యనారాయణ గౌరవ సంపాదకులుగా ఉన్నారు.

గత వందేళ్ళ కాలపు పరిణామాలు, ప్రభావాలు ఉత్తరాంధ్ర కథల్లో ఏవిధంగా చిత్రితమయ్యాయో ఈ కథలు చెబుతాయి. ఆధునిక సాహిత్యంలోని అనేక సిద్ధాంతాల, సూత్రాల, వాదాల ప్రభావాలతో ఉత్తరాంధ్ర కథకులు ఎలాంటి కథలు రాశారో ఈ కథలు చదివితే తెలుస్తుంది. 110 కథలున్నాయి ఈ పుస్తకంలో. ఉత్తరాంధ్ర ప్రాంతం తెలుగు పాఠకలోకానికి అందించిన గొప్ప కథల సమాహారం ఈ పుస్తకం. వందేళ్ళు పైబడిన ఉత్తరాంధ్ర సామాజిక జీవితంలోని అనేక పార్శ్వాల చిత్రణ దీనిలో వుంది. కథకులు తమ అక్షరాలతో ఉత్తరాంధ్రను సత్కరించిన రీతి ఈ కథలు చదివితే అర్థమవుతుంది.

అభ్యుదయోద్యమం, విప్లవోద్యమం మొదలుకొని అనేక వాదాల నేపథ్యాల్లోంచి కథను చిత్రించిన రీతులు విస్మయం గొల్పుతాయి. ఆదివాసీల జీవితకోణాల్ని వ్యక్తం చేసిన నవతరం కథకుల కథలు మరింత ఆకర్షణీయం. ఎన్నో రంగాలకు చెందినవారి జీవితంలోని విషాదానందాలు ఈ కథల్లో వున్నాయి. ఉత్తరాంధ్ర సామాజిక జీవితాన్ని గురించి పరిశోధనలు చేసేవారికి ఇది ఒక మంచివనరు. ఉత్తరాంధ్రలోని వైవిధ్యం, వందేళ్ళలో వచ్చిన మార్పుల క్రమం, జీవన విధానాల్లో పరిణామ వికాసాలు అర్థం చేసుకోడానికి ఈ సంకలనం తోడ్పడుతుంది.

కథని ఎంత అందంగా, రమ్యంగా చెప్పడానికి వీలున్నదో తమ కథల ద్వారా చెప్పిన రచయితలున్నారు. ఇతివృత్తాన్ని కళగా మార్చే విద్య తెలిసిన కథకులు ఉత్తరాంధ్రలో ఎక్కువేనని ఈ కథలు తెలియజేస్తాయి. కనుక సాహిత్యకారులకు సైతం మంచి తోడ్పాటును అందించే లక్షణం గల పుస్తకమిది. అందువల్ల ఈ బృహత్ సంకలనం మన ఇంట్లో వుంచుకొని అప్పుడప్పుడు చదువుతూ ఉండాలి.

- అశోక్

దళిత క్రైస్తవ పరిభాషలో...

ఖండిత స్వప్నాలు (కవిత్వం)
రచన: డా. కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్
పేజీలు: 152, వెల: రూ. 100
ప్రతులకు: కవిపేరున, రాజగృహ,
తర్లుపాడు రోడ్డు
మార్కాపురం-523 316,
ఫోను: 94402 11120

క్రైస్తవ ప్రతీకలని, పరిభాషని తీసుకొచ్చి కవిత్వాన్ని దీప్తిమంతం చేసే సంవిధానం డా. కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్ కవిత్వంలో కనిపిస్తుంది. కవిత్వంలోనే కాదు వచనరచనలలోనూ దీనిని చూడొచ్చు. క్రైస్తవ తాత్వికతను ప్రతిఫలించే రీతిన వారి రచనా వ్యాసంగం కొనసాగుతుంది. ఇదివరలో ఆయన 4 కవిత్వ పుస్తకాల్ని, ఒక నవలని, ఒక కథాసంపుటిని, ఒక వ్యాసాల పుస్తకాన్ని తీసుకొచ్చారు. అలాగే విశ్వధర్మం శీర్షికన దర్శన సమీక్ష కూడా వెలువరించారు. ఆ మధ్యన తీసుకొచ్చిన 'ఖండిత స్వప్నాలు' డేవిడ్ లివింగ్‌స్టన్ కవితాభివ్యక్తిలో కొత్త కోణం. దళిత క్రైస్తవ ప్రతీకల్ని విరివిగా వాడారు. దళితుల సంవేదనల్ని, ప్రపంచీకరణ ప్రభావంలో మారుతున్న సంబంధాల్ని ఆవిష్కరించిన కవితా సంపుటి ఇది. దీనిలో 57 కవితలున్నాయి. ఒక్కొక్క కవితకు అర్థవంతమైన అలెగ్జాండర్ వేసిన 57 బొమ్మలున్నాయి. కవిత్వ సారాన్ని రూపుగట్టించే చిత్రాలివి. రేఖల్లో లాలిత్యం వుంది. కవిత్వంలో గాఢతను దృశ్యమానం చేశారు.

సామాజిక జీవితంలోని బహుళ కోణాల్ని డేవిడ్ లివింగ్‌స్టన్ కవిత్వం వ్యక్తం చేస్తుంది. విభిన్న సందర్భాల్లో కవి స్పందనల్ని తెలియజేస్తాయి ఈ కవితలు. చీకటంటే ఇష్టమంటారు. అభివృద్ధిలోని అపసవ్యతల్ని ప్రశ్నిస్తారు. ఒబామాను నల్లసూరీడుతో పోలుస్తారు. మనల్ని శాసిస్తున్న విలువల గురించి ప్రశ్నిస్తారు. ఏకంగా యుద్ధభేరిని మోగించే కవితను రాసిన శ్రీశ్రీని స్మరిస్తారు. ఏ కోణంలోంచి చూసినా, సామాజిక పరిణామాలపై స్పందించే నైజం ఈ కవిలో బలంగా వుందని తెలియజెప్పే కవిత్వమిది. ముందుమాట రాసిన శివారెడ్డి గారన్నట్టు డేవిడ్ లివింగ్‌స్టన్ కవిత్వంలో ఒక అంతస్సూత్రం వుంది. ఒక ఆగ్రహం వుంది. ఒక సంయమనం వుంది. తనదయిన వ్యక్తీకరణ వుంది. అందుకే ఇది కవిత్వ పాఠకులకు నచ్చుతుంది.

- ఎస్.దుర్గాప్రసాద్

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటీ రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-500030.

■ ఈ వారం కవిత్వం

ఒక మరణ వాక్యం...!

సరిహద్దుకావల
ఒక సరికొత్త మరణ వాక్యం
వాక్యం చివర
ఉరితీయబడ్డ గులాబీ
పులి చంపిన లేడి నెత్తురుతో
చీకటి సంతకం
ప్రపంచంలో ఎక్కడో ఓ మూల
ఇంకా చీకటి మిగిలే ఉంది.
ఆటవిక గుహల నిండా
రాసుకున్న గుడ్డి చట్టాలు
ఇంకా కళ్లు తెరవనే లేదు
వెంటాడి వేధించిన కౄరమృగాన్నీ
వేటాడిన గులాబీనా
రేకులు విరిచేది
రేకులుగా విడివడి రాలుతున్న
ఆమె రూపం కింద
నా దేశమైతే దోసిలి పట్టేది
కొన్ని దేశాల్లో ఇంకా
ఈ చీకట్లేమిటి!
గులాబీలెక్కడివైనా
పరిమళం గొప్పది కదా!
సాహస పరిమళంగా
గుబాళించిన ఓ గులాబీ
నీ దేశాన్ని క్షమించు.
నిన్ను చిదిమిన
చేతుల్ని క్షమించు
నువ్వెప్పటికీ
ముద్దాయివి కాదు
దేశదేశాల తలుపులు
తెరుచుకుంటున్నాయి.
తలుపు సందుల్లోంచి
తొంగి చూస్తున్న వెలుగు
గులాబీ వర్ణం దాలుస్తోంది.
నువ్వొదిలి వెళ్లిన
చివరి వాక్యం
నీ దేశాన్ని తప్పక శాసిస్తోంది
(ఇరాన్‌లో మరణశిక్ష విధించబడిన రెహానా జబ్బారీ కోసం...)

– చిత్తలూరి సత్యనారాయణ, 9912346673

పొగచూరిన రెండు పద్మాలు

రాత్రయ్యేసరికి
వాడికళ్ళు
పొగచూరిన రెండు పద్మాలు
గ్రహణం పట్టిన రెండు చందమామలు
కందెనలో ముంచితీసిన రెండు బండిచక్రాలు
ఉదయాన
రెండు లేత సూర్యుళ్ళలా
రెండు సున్నిత కుందేళ్ళలా
అప్పుడే తుడిచిన రెండు అద్దాల్లా
అప్పుడే విరిసిన రెండు తెల్ల గులాబీల్లా
ముద్దాడాలనిపించే ఆ రెండు పాలసరస్సులు
రాత్రయ్యేసరికి
మాడిపోయిన రెండు అరిసెలు
రీంతో సహా కాలిపోతున్న రెండు టైర్లు
చుట్టూ నల్లటి వలయాలతో
చీకటితో నిండిన రెండు వృత్తాలు

జాలేస్తుంది
ఆరోతరగతి చదువుతున్న
వాడి అలసిన కళ్ళను చూస్తే
నా రెండు కళ్ళు
పగిలిని నీటి ప్యాకెట్లై
చెంపల మీంచి కన్నీళ్ళై జారుతున్నట్టుంటుంది
ఉదయం నుండి విరామం లేకుండా
బడికి హోంవర్కులకే
పరిమితం చేసిన
ఈ రాబందు వ్యవస్థ రాకాసికళ్ళను
పీకేయాలనిపిస్తుంది.

– నవీన్, 95537 37304



పెన్సిల్ ములుకు నిర్మాణాలు

పెన్సిళ్లతో ఎవరైనా ఏం చేస్తారు? రాసుకుంటారు, బొమ్మలేస్తారు. పెన్సిల్ చెక్కినప్పుడు వచ్చిన పొట్టుతో రకరకాల ఆకారాల బొమ్మలు చేస్తారు. కానీ పెన్సిల్ ములుకుతో పైన చెప్పినట్టు రాయడానికి, బొమ్మలేయడానికి తప్ప మరిదేనికీ పనికిరాదు అనుకుంటాం మనమైతే. కానీ జాన్ బిస్‌బీ ఈ పెన్సిల్ ములుకులతో రకరకాల ఆకారాలు తయారుచేస్తాడు. గ్రామ్‌ఫోన్ రికార్డు మైక్, స్ప్రింగ్, బంతి, పూలు, కొండలు... ఇలా ఎన్నో ఆకారాలు. పెన్సిల్ ములుకు ఒక్కటే అయినా దానితో ఏమైనా చేయాలంటే చాలా రకాలుగా ఆలోచించొచ్చు అంటాడు జాన్.

ఆశ్చర్యపరిచే ఆకృతులతో ఆసక్తికరమైన నిర్మాణాలు

ఈ ఫొటోలను చూశారుగా. ఎలా వున్నాయి? ఇంద్రభవనంలోని గదులను తలదన్నేలా ఉన్నాయి. ఇవన్నీ ఏ బ్రిటీష్ మహరాజు, మైసూర్ మహరాజు, నేపాల్ రాజుల ప్యాలెస్‌లలోని భాగాలు, అక్కడ కనిపిస్తున్నవారంతా చూడ్డానికి వచ్చిన టూరిస్టులని అనుకుంటున్నారు కదూ ! అక్కడే పొరబడుతున్నారు. ఇవన్నీ మాస్కోలోని భూగర్భ రైల్వే స్టేషన్లు. ఇక్కడ 1935లో మొదటిసారి భూగర్భ రైలు మార్గాన్ని 11 కిలోమీటర్ల పొడవు, 13 స్టేషన్లతో నిర్మించారు. ఇది భూమికి 74 మీటర్లు కిందికి వుంది. తర్వాత ఈ రైలు మార్గాన్ని ప్రపంచంలోనే ఆరో స్థానంలో ఉండేవిధంగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఆశ్చర్యపరిచే నిర్మాణంతో, ఆసక్తిగొలిపే ఆకృతులతో 195 భూగర్భ రైల్వే స్టేషన్లు మాస్కోలో దర్శనమిస్తున్నాయి. వాటిలో కొన్ని...